**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 91, పేజీలు - 08

బుధవారం, సెప్టెంబర్ 30, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD





## కేసీఆర్, కేటీఆర్ కోటలపై

# రేవంత్ గురి!



**- సిరిసిల్ల, గజ్వేల్‌లో అభివృద్ధి అస్త్రం - గులాబీ కంచుకోటల్లో కాంగ్రెస్ వ్యూహం**

**- గులాబీ పట్టును తగ్గించడం సాధ్యమేనా?**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తమ ప్రత్యర్థి భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)ను ఆత్మరక్షణలో పడేసేందుకు కొత్త వ్యూహాలకు పదును పెడుతోంది.

గతంలో బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిరిసిల్ల నియోజకవర్గాల్లో పర్యటించడం ద్వారా నేరుగా వారి స్థానాల్లోనే గులాబీ కోటలను బద్దలు కొట్టాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.

ఈ క్రమంలోనే సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించి సుమారు రూ. 1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది.

### అభివృద్ధి నినాదంతో గులాబీ కోటల్లోకి సీఎం ఎంట్రీ

గత ఇరవై ఏళ్లుగా సిరిసిల్ల నుంచి కేటీఆర్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, అక్కడ స్థానిక చేనేత వర్గాల సమస్యలు, మౌలిక వసతులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయనేది కాంగ్రెస్ ప్రధాన ఆరోపణ. గజ్వేల్‌లో కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ నియోజకవర్గానికి అందుబాటులో ఉండటం లేదనే అసంతృప్తిని ఆసరాగా చేసుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రణాళికలు రచిస్తున్నారు. తాము భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చూపించడం ద్వారా, గత ప్రభుత్వంలో కేవలం ప్రచారానికే ప్రాధాన్యం ఇచ్చారని ప్రజలకు వివరించి పొలిటికల్ అడ్వాంటేజ్ పొందాలనేది కాంగ్రెస్ యోచనగా కనిపిస్తోంది.

### ప్రజాక్షేత్రంలో అగ్రనేతలను బోనులో నిలపడం

కేవలం అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వడమే కాకుండా, సభా ప్రాంగణాల నుంచే బీఆర్ఎస్ అగ్రనేతలను నేరుగా నిలదీయడం ఈ పర్యటనల ముఖ్య ఉద్దేశం. సిరిసిల్లను అపారమైన భూముల ఆక్రమణల ఆరోపణలతో ముడిపెట్టడం, అదే సమయంలో కేటీఆర్ పహాణీలు, సంక్షేమ పథకాల అమలుపై కాంగ్రెస్ వైపు నుంచి

2లో..

## రిటైలర్ మార్జిన్ అందరికీ

# ఎందుకు వర్తించదు?

**- మెడిసిన్స్ ధరలపై సుప్రీం సంచలన ప్రశ్న**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)**(ప్రాణాలను కాపాడే మెడికల్ ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్స్ ధరలు సామాన్యుడికి మోయరాని భారంగా మారుతున్నాయి. ఇదే అంశంపై విచారణ చేపట్టిన దేశ అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ప్రశ్నల వర్షం కురిపించింది. దేశంలోని అన్ని రకాల మందులపై ఒకే రకమైన రిటైలర్ మార్జిన్‌ను ఎందుకు అమలు చేయకూడదని సుప్రీంకోర్టు సూటిగా నిలదీసింది. ఔషధ ధరల నియంత్రణ విధానంలో భాగంగా కొన్ని మందులకు ఇస్తున్న 16 శాతం మార్జిన్‌ను అన్ని రకాల నిత్యావసర, నాన్-ఇన్సెన్షియల్, పేటెంట్- జెనరిక్ మందులన్నింటికీ ఎందుకు వర్తింపజేయలేరని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది.

2లో..

## బొగ్గు కొనుగోలు..

# తుగ్లక్ నిర్ణయం

**- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శ**

**- చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారని ఆరోపణ**

**- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం**

**- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి కోసం విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రంలోనే తక్కువ ధరకు సింగరేణి బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ, అధిక ధరకు విదేశీ బొగ్గును కొనుగోలు చేయాలనుకోవడం

2లో..

## తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్రను ఒప్పించండి

**- కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి!**



**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కీలక సాగునీటి ప్రాజెక్టులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరోసారి కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రస్తావించింది. ప్రస్తుతం ఢిల్లీ టూర్‌లో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర నుంచి అవసరమైన

2లో..

## రీల్స్ కంటే కెపాసిటి బిల్డింగ్ కోసం

# టైం కేటాయించండి

**- వచ్చే 20 ఏళ్లలో భారత్ అగ్రస్థానానికి ఎదగాలి**



**- విజయవాడలో మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల సదస్సు**

**- ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఏపీకి దేశంలోనే ప్రథమ స్థానం**

**- పాలనలో టెక్నాలజీ వాడకం పెరగాలని సీఎం చంద్రబాబు పిలుపు**

**- నేర్చుకున్న నైపుణ్యాలు సేవల నాణ్యతలో కనిపించాలని స్పష్టీకరణ**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** 'వచ్చే 20 ఏళ్లలో భారత్ అగ్రస్థానానికి ఎదగాలి. దానికి అనుగుణంగా మనం అంతా కలిసి పనిచేయాలని కోరుతున్నాను. గతంలోనే ఉమ్మడి ఏపీలో మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ద్వారా అధికారులు ఉద్యోగుల్లో సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేశాం'అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.'కెపాసిటి బిల్డింగ్ లో విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థలు సహకారం కూడా తీసుకుని ముందుకు వెళ్లాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ నిర్వహిస్తోన్న మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సును ప్రారంభించిన సీఎం చంద్రబాబు నాయుడు కీలకోపన్యాసం చేశారు.

2లో..

## పల్లె పండుగ 3.0 ప్రారంభం..

# గ్రామాలకు రూ.11,085 కోట్లు

**- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమం ప్రారంభం**

**- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన**

**- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి**

**- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు**

**- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

2లో..

## తెలంగాణలో విద్యుత్ డిమాండ్ ఆల్‌టైమ్ రికార్డు

**- 12,044 మెగావాట్లకు చేరిన వినియోగం!**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. గృహ, వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల నుంచి పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లు విద్యుత్ డిమాండ్ కూడా భారీగా పెరిగింది. తాజాగా తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ( టీజీఎస్‌పీడీసీఎల్ ) పరిధిలో విద్యుత్ డిమాండ్ ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరింది.

2లో..

## ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే

# మహిళలతో కొట్టిస్తా

**- ప్రత్యర్థులకు మాజీమంత్రి కొండా సురేఖ వార్నింగ్**

**- ప్రతిపక్ష నేతలు గాల్లో కత్తులు తిప్పుతున్నారంటూ వ్యాఖ్య**

**- కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలని నేతలకు సూచన**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీమంత్రి కొండా సురేఖ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నా ముందు కుప్పిగంతులు వేస్తే ఊరుకోం.కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి అంటూ వార్నింగ్ ఇచ్చారు. 'నోరుజారి మాట్లాడితే మహిళలతో ఎక్కడ దొరికితే అక్కడ కొట్టిస్తాం.నా వెనక నిలబడ్డ మహిళలు ఒక్కొకరు నలుగురిని కొడతారు. మా ముందు కుప్పి గంతులు వేస్తే అడోళ్ళతో కొట్టిస్తా. కొండా ఫ్యామిలీ అనుచరుల జోలికి వస్తే

3లో..

## రాజకీయాల కోసం దేవుళ్లను

# విడదీస్తావా

**- రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ ఫైర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఉత్తర, దక్షిణ భారత రాజకీయ సంస్కృతిని ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము శివ

3లో..

## నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా

**- కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్**

**- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు**

**- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత**

**- ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ పార్టీపై, కేటీఆర్‌పై టీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడిన కేటీఆర్, కేసీఆర్‌ను తప్పుపడుతున్నారని

3లో..

# అసెంబ్లీ ఘటనపై హైకోర్టు కీలక ఆదేశాలు

**- దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి**

**- తెలంగాణ డీజీపీకి హైకోర్టు ఆదేశం**

**- సంబంధిత పోలీసుల వివరాలను స్పీకర్‌కు సమర్పించాలని సూచన**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

2లో..

# కేసీఆర్, కేటీఆర్ కోటలపై రేవంత్ గురి!

వైట్ పేపర్ సవాళ్లు విసరడం ద్వారా ప్రతిపక్షాన్ని డిఫెన్స్‌లో పడేసే మైండ్ గేమ్‌ను రేవంత్ రన్ చేస్తున్నారు. ఈ వ్యూహం ద్వారా సాధారణ కార్యకర్తల్లో బీఆర్ఎస్ అగ్రనేతలపై ఉన్న అజేయమైన బింబాలను సడలించవచ్చని భావిస్తున్నారు.

## గులాబీ కోటలను బద్దలు కొట్టడం అంత తేలికేనా?

కేవలం అభివృద్ధి నిధులు ప్రకటించినంత మాత్రాన గజ్వేల్, సిరిసిల్ల వంటి సుదృఢమైన స్థానాల్లో బీఆర్ఎస్ పట్టును తగ్గించడం కాంగ్రెస్‌కు అంత సులువైన విషయం కాదనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. సిరిసిల్లలో కేటీఆర్ దశాబ్ద కాలంగా నియోజకవర్గంలో కదిలిన వ్యవస్థలు, చేనేత శ్రేణులతో ఏర్పాటు చేసుకున్న అనుబంధం, స్థానిక బలం కేవలం ఒక్క రోజు పర్యటనతో చెదిరిపోయేది కాదు. అలాగే గజ్వేల్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్స్ వల్ల కేసీఆర్‌కు ప్రత్యేకమైన ప్రజాదరణ, బలమైన ఓటు బ్యాంకు ఉందనేది వాస్తవం.

## స్థానిక యంత్రాంగం, నాయకత్వ లోపం

ఈ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ద్వితీయ శ్రేణి బలమైన నాయకత్వం లోపించడం . బీఆర్ఎస్ అధినేతలకు సవాల్ విసిరే స్థాయి స్థానిక కాంగ్రెస్ నేతలు ఈ స్థానాల్లో లేకపోవడం పెద్ద మైనస్. ఎంత సీఎం స్వయంగా వెళ్లి రూ. 1000 కోట్ల అభివృద్ధి పనులను ప్రకటించినా, వాటిని నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లే స్థానిక క్యాడర్ లేకపోతే ఆ నిధుల ప్రభావం ఓట్లుగా మారడం కష్టం. దీనికి తోడు చేనేత కార్మికుల పెండింగ్ బకాయిలు, సబ్సిడీలను పునరుద్ధరించాలని కేటీఆర్ కౌంటర్ డిమాండ్లు లేవనెత్తుతుండటంతో కాంగ్రెస్ ముందస్తు ప్రణాళికలకు గట్టి పోటీ ఎదురవుతోంది.

## ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొనే సవాలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు స్థానికంగా ఏ మేరకు అమలవుతున్నాయనే ప్రశ్నకు కూడా సీఎం సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. ఉచిత హామీల అమలులో జరుగుతున్న ఆలస్యాన్ని బీఆర్ఎస్ ఇప్పటికే అస్త్రంగా మార్చుకుంది. సిరిసిల్లలో అభివృద్ధి పనులను కాంగ్రెస్ వేగవంతం చేసినా, హామీల అమల్లో అసంతృప్తి ఉంటే ప్రజలు వెంటనే కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతారని చెప్పలేము. గజ్వేల్, సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి వేస్తున్న అడుగులు తక్షణ ఎన్నికల ప్రయోజనాల కోసం కాకుండా, భవిష్యత్ రాజకీయ స్థిరీకరణ కోసం వేస్తున్న వ్యూహాత్మక పునాదిగా భావించవచ్చు. భారీ బహిరంగ సభలు, నిధుల వరద ద్వారా బీఆర్ఎస్ క్వీన్-కింగ్స్‌కు సవాల్ విసురుతూ, వారిని సొంత నియోజకవర్గాల పరిధిలోనే డిఫెన్స్ చేసుకునేలా ఒత్తిడి పెంచడం రేవంత్ రెడ్డి నయా పొలిటికల్ స్ట్రాటజీ. అయితే, ఇది బీఆర్ఎస్ కోటలను ఏ మేరకు బద్దలు కొడుతుందో కాలమే నిర్ణయించాలి.

# రిటైలర్ మార్జిన్ అందరికీ ఎందుకు వర్తించదు?

## రూ.2,700 మందు.. రూ.27,000 ధర!

మందుల తయారీదారులకు, సామాన్యులకు విక్రయించే ఎంఆర్పీ మధ్య ఉండే భారీ వ్యత్యాసాన్ని గత వార విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఒక క్యాన్సర్ మందు రిటైలర్లకు కేవలం రూ.2,700కే అందజేయబడుతుండగా, అదే మందును పేషెంట్లకు మాత్రం రూ.27,000 ఎమ్ఆర్‌పికి అమ్ముతున్న వైనాన్ని న్యాయస్థానం ఉదాహరణగా పేర్కొంది. దేశంలోని సుమారు 82 శాతం మందులు ధరల నియంత్రణ ఉత్తర్వుల పరిధిలోకి రాకుండా స్వేచ్ఛగా అమ్ముడవుతున్నాయని పిటిషనర్ కిషన్ చంద్ జైన్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ భారీ వ్యత్యాసంపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు.

## ఆసుపత్రుల దోపిడీపై నిలదీత

ప్రైవేట్ ఆసుపత్రుల్లోని ఫార్మసీల ద్వారానే రోగులు మందులు, వైద్య పరికరాలు కొనుగోలు చేయాలంటూ బలవంతం చేయడంపై కూడా సుప్రీంకోర్టు మండిపడింది. ఆసుపత్రుల లోపల ఉండే ఫార్మసీలు చెప్పినంత ధర చెల్లించి మందులు కొనాల్సి వస్తోందని, అసలు రోగులకు బయట కొనుగోలు చేసే స్వేచ్ఛ ఎక్కడ ఉందని కోర్టు ప్రశ్నించింది. ఆసుపత్రులు వసూలు చేస్తున్న గరిష్ట ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. రోగుల బలహీనతను ఆసరా చేసుకుని ఆసుపత్రులు చేస్తున్న ఈ వ్యాపార ధోరణికి అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేసింది.

## సరఫరా వ్యవస్థపై కంపెనీల వాదనలు

ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ మాట్లాడుతూ పేదలకు సరసమైన ధరలకే మందులు అందించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, మెరుగైన విధానాల రూపకల్పనకు సిద్ధంగా ఉన్నామని కోర్టుకు తెలిపారు. మరోవైపు, ఫార్మా కంపెనీల తరఫున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ వాదిస్తూ రిటైలర్ ధరలకు, ఎంఆర్‌పీకి మధ్య కనిపించే భారీ లాభం పూర్తిగా ఫార్మా కంపెనీల వద్దే ఉండిపోదని, సరఫరా గొలుసులోనివివిధ దశలను పరిశీలించాలని కోర్టును కోరారు.

## తదుపరి విచారణ అక్టోబర్ 12కి వాయిదా

ప్రస్తుతానికి మందుల ధరల నియంత్రణపై సుప్రీంకోర్టు ఎలాంటి తుది ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, న్యాయస్థానం లేవనెత్తిన ప్రశ్నలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మెడికల్ పరికరాలు, మందుల ధరలు మరియు జెనరిక్ మందుల విధివిధానాలపై దాఖలైన పలు పిటిషన్లను విచారించిన ధర్మాసనం తదుపరి విచారణను అక్టోబర్ 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ లోపు ఈ అంశంపై సమగ్ర నివేదిక అందజేయాలని కోర్టు భావిస్తోంది.

# బొగ్గు కొనుగోలు.. తుగ్లక్ నిర్ణయం

ప్రభుత్వ మరో 'తుగ్లక్ నిర్ణయం' అని ఆయన విమర్శించారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే లభిస్తుంటే విదేశీ బొగ్గు కోసం దాదాపు రూ.9,000 చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ఖజానాపై అదనపు భారం పడటమే కాకుండా, చివరకు ఆ భారాన్ని ప్రజలపై మోపే పరిస్థితి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ఎవరి ప్రయోజనాల కోసం?

విదేశీ బొగ్గు కొనుగోలు నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన బొగ్గు నిల్వలు, సింగరేణి వంటి సంస్థ ఉన్నప్పుడు అధిక ధరకు దిగుమతులు చేసుకోవాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు. దక్షిణ భారతదేశంలోనే తెలంగాణకు భారీ బొగ్గు నిల్వలు ఉన్నాయని గుర్తుచేసిన కేటీఆర్.. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు కూడా బొగ్గును సరఫరా చేసిందని పేర్కొన్నారు.

## 24 గంటల విద్యుత్ సరఫరాకు సింగరేణి బొగ్గే ఆధారం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గును ఉపయోగించి టీఎస్ జెన్‌కో ద్వారా 24 గంటల విద్యుత్ సరఫరా చేసిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించకుండా, అధిక ధరకు విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవడంలోని ఆంతర్యాన్ని ప్రభుత్వం ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు దిగుమతిపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రస్తుతం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది.

# భూముల అవకతవకలపై కమిటీ సభ్యుడు ఐఏఎస్ సందీప్ కుమార్ ఝా సమీక్ష



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం భూముల అవకతవకలపై కమిటీ సభ్యుడు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రెవెన్యూ అధికారులతో మంగళవారం

సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జీవో నంబర్ 134 ప్రకారం భూములపై నియమించిన కమిటీ సభ్యుడు జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లాలోని తహసీల్దార్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూములపై సమీక్షించి. భూములు అవకతవకలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

# తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్రను ఒప్పించండి

అనుమతులు త్వరగా వచ్చేలా చొరవ తీసుకోవాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ 152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ చేసిన ప్రతిపాదనను మహారాష్ట్ర అంగీకరించేలా కేంద్రం మధ్యవర్తిత్వం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఎత్తు అంశం కీలకంగా మారింది. గతంలో 148 మీటర్ల ఎత్తు ప్రతిపాదనపై ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగాయి. అయితే బ్యారేజీని 150-152 మీటర్ల స్థాయిలో నిర్మిస్తే ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని గ్రావిటీ ద్వారా తరలించే అవకాశం ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. గతంలోనూ సీఎం రేవంత్ రెడ్డి ఇదే అంశంపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.గ్రావిటీ ఆధారంగా నీటిని తరలించగలిగితే భారీగా విద్యుత్ వినియోగించే లిఫ్ట్ విధానంపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. దీంతో నీటి తరలింపునకు అయ్యే విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయంపై కూడా ప్రభావం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రికి వివరించినట్లు సమాచారం. తుమ్మిడిహెట్టి బ్యారేజీకి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సమర్పించినట్లు సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రికి తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారుల మధ్య ఈ ప్రాజెక్టుపై సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై చర్చలు జరిగిన విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందు నుంచే తెలంగాణ 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తోంది.అయితే తుది నిర్ణయం తెలంగాణ, మహారాష్ట్రల మధ్య అంగీకారం, సంబంధిత కేంద్ర అనుమతులపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ప్రధానంగా మహారాష్ట్రతో ఏకాభిప్రాయం కుదిరేలా కేంద్రం చొరవ తీసుకోవాలన్నదే తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి. సమావేశంలో తుమ్మిడిహెట్టితో పాటు తెలంగాణకు చెందిన పలు సాగునీటి ప్రాజెక్టుల అంశాలను కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్‌కు పర్యావరణ అనుమతులు త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో పర్యావరణ అనుమతులకు సంబంధించి కేంద్రం మార్గదర్శకాలు రూపొందించనున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్టులకు వీలైనంత త్వరగా క్లియరెన్స్ ఇవ్వాలని సీఎం కోరినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అనుమతులు ఆలస్యం కావడం వల్ల నిర్మాణ వ్యయం పెరుగుతోందని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను కూడా వేగంగా మంజూరు చేయాలని సీఎం కోరారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇప్పటికే సీడబ్ల్యూసీకి సమర్పించినట్లు తెలిపారు. నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) పొందేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలో ఏర్పాటు చేయాల్సిన టెలీమెట్రీ వ్యవస్థపైనా సమావేశంలో చర్చ జరిగింది. మొదటి దశ టెలీమెట్రీ పరికరాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిందని సీఎం గుర్తుచేశారు.

మొదటి దశ పరికరాలను త్వరగా ఏర్పాటు చేయడంతో పాటు రెండో, మూడో దశలకు సంబంధించిన టెలీమెట్రీ యంత్రాలను కూడా వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కృష్ణా జలాల వినియోగాన్ని పర్యవేక్షించడంలో టెలీమెట్రీ వ్యవస్థకు ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో ఈ అంశాన్ని కూడా తెలంగాణ ప్రభుత్వం కేంద్రం ముందు ఉంచింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచే ప్రతిపాదనపై తెలంగాణ ప్రభుత్వం కేంద్రం ద్వారా మహారాష్ట్రతో ఏకాభిప్రాయం సాధించాలని ప్రయత్నిస్తోంది. అయితే ఇప్పటివరకు దీనిపై తుది అంగీకారం కుదిరినట్లు అధికారికంగా ప్రకటించలేదు. అందువల్ల సీఎం రేవంత్ రెడ్డి తాజా భేటీ తర్వాత ఈ అంశంలో తదుపరి చర్చలు, కేంద్రం-మహారాష్ట్ర స్థాయిలో జరిగే సమావేశాలు కీలకంగా మారనున్నాయి.

## పల్లె పండుగ 3.0 ప్రారంభం..

# గ్రామాలకు రూ.11,085 కోట్లు

ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

## గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది," అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

## ఉదయగిరికి వరాల జల్లు

ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు. 65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు. 90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 భూసేకరణకు రూ.85 కోట్లు. రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు. కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

## సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఘటనపై హైకోర్టు కీలక ఆదేశాలు

ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే.మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

## రీల్స్ కంటే కెపాసిటి బిల్డింగ్ కోసం

# టైం కేటాయించండి

ఈ కార్యక్రమానికి హాజరైన ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. 'ప్రభుత్వ ఉద్యోగుల్లో సామర్థ్యాల పెంపు, పరిపాలనా నైపుణ్యాలు మెరుగు పరచడమే లక్ష్యంగా మిషన్ కర్మయోగి రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించనుంది. ప్రభుత్వ శిక్షణ సంస్థల కెపాసిటి బిల్డింగ్, ఉద్యోగుల నైపుణ్యం పెంపు అంశాలపై ఈ సదస్సులో చర్చ జరగనుంది. ఉన్నతి కార్యక్రమం ద్వారా సామర్థ్యాల పెంపు కోసం ఐగాట్, మిషన్ కర్మయోగి క్వాలిటీ ఫ్రేమ్ వర్క్ భాగస్వామ్యంలో ముసాయిదా రూపకల్పన చేయనున్నారు. రెండు రోజుల సదస్సులో వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రజెంటేషన్లు ఇవ్వనున్నారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా కాకుండా, ఆయా శాఖల పనితీరును మెరుగు పరిచేలా సన్నద్ధం అయ్యేలా కార్యాచరణ చేపట్టనున్నారు.

## ప్రధాని మోడీ కెపాసిటీ బిల్డింగ్‌కు ఓ ప్రత్యక్ష ఉదాహరణ

'ఏఐ లాంటి అధునాతన టెక్నాలజీ, అపారమైన అవకాశాలు, యువత, దేశ ప్రజల ఆకాంక్షలు మన ఎదుట ఉన్నాయి. మన పాలనా వ్యవస్థలు, సంస్థలు ప్రజల ఆకాంక్షల్ని ఏమేరకు తీర్చగలం అన్నదే ప్రధానమైన అంశం. వచ్చే 20 ఏళ్లు భారత్ అభివృద్ధికి అత్యంత కీలకమైన సమయం. ఈ సమయంలోనే మన వ్యవస్థలు, సంస్థలు విప్లవాత్మకమైన మార్పుల్ని సంతరించుకోవాల్సి ఉంది.'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'రైల్వే స్టేషన్‌లో చాయ్ విక్రేత నుంచి ఇప్పుడు దేశ ప్రధాని వరకూ ఎదిగిన ప్రధాని మోడీ కెపాసిటీ బిల్డింగ్‌కు ఓ ప్రత్యక్ష ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్ లోని ఓ ఉపాధ్యాయురాలు ఈ కెపాసిటీ బిల్డింగ్ ద్వారా మీ ముందుకు వచ్చి మాట్లాడగలిగారు. భారత్‌లో ఉన్న అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నదే ఇప్పుడు అందరి లక్ష్యం. అందుకే కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ద్వారా ఐగాట్- మిషన్ కర్మయోగి కార్యక్రమాన్ని ప్రధాని చేపట్టారు. ఎప్పటికప్పుడు సామర్థ్యాలు పెంచుకునేలా ఆన్ లైన్ శిక్షణ ఐగాట్ - మిషన్ కర్మయోగి ద్వారా అందుతోంది'అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

## ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు తమ నైపుణ్యాలను చాటి చెప్పారు

'రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రభుత్వ శాఖల్లో అధికారులు, ఉద్యోగులు శిక్షణ పొందితేనే నాణ్యమైన సేవలు అందించగలం. చైనా 1978లో మొదలు పెట్టి కొన్ని దశాబ్దాల్లోనే తన సామార్థ్యాలను విపరీతంగా పెంచుకోగలిగింది'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.'ఆర్థికంగా ఉన్నతస్థాయిలో ఇప్పుడు ఆ దేశం తన సామర్థ్యాలను గణనీయంగా నమోదు చేస్తోంది. ఆ దేశంతో సమానంగానే అపారమైన అవకాశాలు, వనరులు ఉండి మనం ఎందుకు వెనుకబడ్డామన్నది బేరీజు వేసుకోవాలి. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు తమ నైపుణ్యాలను అంతర్జాతీయంగా చాటి చెప్పారు'అని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

## ప్రగతిని నిరోధించే నిబంధనలు అవసరం లేదు

'రాజకీయంగా పాలన మారవచ్చు కానీ భారతీయులుగా మనం అంతా దేశాన్ని అత్యున్నతస్థాయిలో నిలిపేలా పనిచేయాల్సిందే. ఆర్థిక సంస్కరణల తర్వాత భారతీయుల ఆకాంక్షలు మారిపోయాయి. అందుకు అనుగుణంగా వ్యవస్థలూ నడవాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. 'ప్రపంచ వ్యాప్తంగా వివిధ గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి అగ్రగామి కంపెనీలకు భారతీయులే సారథ్యం వహిస్తున్నారు. గతంలో ఐటీ విప్లవం వచ్చింది, ఇప్పుడు ఏఐ కాలం నడుస్తోంది. దానికి అనుగుణంగా మనం మారాల్సిందే'అని సీఎం పేర్కొన్నారు. 'అందుకే జన్ విశ్వాస్ సంస్కరణలు ఇప్పుడు అత్యంత కీలకంగా మారిపోయాయి. మన నిబంధనలు కూడా దానికి అనుగుణంగా ఉండాలి. ప్రగతిని నిరోధించే అనవసరమైన నిబంధనలు ఇప్పుడు అవసరం లేదని భావిస్తున్నాను. వీటిని సులభతరం చేయాల్సిందే'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

## ప్రభుత్వ యంత్రాంగం లేకుండా ఏ ప్రకృతి విపత్తును ఎదుర్కోలేం

'రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా ఎప్పటికప్పుడు పాలనా వ్యవహారాలను, పౌరసేవల నాణ్యతను పర్యవేక్షిస్తున్నాం. డేటా లేక్ లాంటి వ్యవస్థలు, ఇ- ఫైళ్ల విధానం ద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. కీ పెర్ఫార్మెన్సు ఇండి కేటర్లను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో సూచనలు జారీ చేస్తున్నాం. ఐ గాట్ కర్మయోగి పోర్టల్ ద్వారా 2 కోట్ల కోర్సులను పూర్తి చేసి ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టిన యంత్రాంగాన్ని అభినందిస్తున్నాను'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'ఉద్యోగులు, ప్రభుత్వ యంత్రాంగం లేకుండా ఏ ప్రకృతి విపత్తును ఎదుర్కోలేం, పండుగలైనా, కార్యక్రమాలైనా ఉద్యోగులే కీలకం. కుటుంబాలను సైతం పక్కన పెట్టి ఉద్యోగులు ప్రజా సేవలో నిమగ్నం అవుతున్నారు. వారిని ఎప్పుడూ విస్మరించలేం. అందుకే వారి సామర్థ్యాలను పెంచేలా, నైపుణ్యాలు అందిపుచ్చుకునేలా ఈ శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## రీల్స్ కంటే కెపాసిటి బిల్డింగ్ కోసం సమయం వెచ్చించండి

'నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా ఐగాట్ -మిషన్ కర్మయోగి ప్రయత్నం చేస్తోంది. రీల్స్ కంటే కెపాసిటి బిల్డింగ్ కోసం సమయం వెచ్చిస్తే మన వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రజలకు అందించే సేవల నాణ్యత పెరగాలంటే టెక్నాలజీని, విధానాలను అనుసంధానిస్తూ ముందుకు వెళ్లాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'ప్రభుత్వ శాఖల మధ్య నిరంతరాయంగా సమాచార పంపిణీ జరగాలి అప్పుడే వేగంగా నిర్ణయాలు తీసుకోగలం. యువత ఆకాంక్షలకు అనుగుణంగా మనం నిర్ణయాలు తీసుకున్నప్పుడే దేశం అగ్రస్థానానికి చేరుతుంది. సంక్షోభంగా మారకముందే మనం సమస్యల్ని గుర్తించి వాటిని పరిష్కరించేలా నైపుణ్యాలు పెరగాలి. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి చేసేలా ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తం కావాలి. దేశంలోని ప్రతీ పౌరుడి జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యంగా మనం అంతా కలిసి పనిచేయాలి. పీ4 లాంటి కార్యక్రమాల ద్వారా జీవన ప్రమాణాలను పెంచటం సాధ్యం అవుతుంది. ప్రాంతాలు, భాషలు, సంస్కృతులూ వేరైనా దేశంగా మన అందరి లక్ష్యం ఒక్కటే'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# తెలంగాణలో విద్యుత్ డిమాండ్ ఆల్‌టైమ్ రికార్డు

మంగళవారం మధ్యాహ్నం 3.52 గంటలకు ఏకంగా 12,044 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైంది. టీజీఎస్‌పీడీసీఎల్ చరిత్రలో ఇదే అత్యధిక డిమాండ్‌గా విద్యుత్ అధికారులు వెల్లడించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో ఇంతకుముందు అత్యధికంగా 11,828 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఈనెల 11వ తేదీన మధ్యాహ్నం 12.44 గంటలకు ఈ రికార్డు నమోదైంది. తాజాగా 12,044 మెగావాట్లకు డిమాండ్ చేరడంతో పాత రికార్డు అధిగమించబడింది. అంటే గత గరిష్ఠ డిమాండ్‌తో పోలిస్తే తాజాగా మరో 216 మెగావాట్ల మేర విద్యుత్ అవసరం పెరిగింది. ఒక్కసారిగా వినియోగం పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి పెద్ద సాంకేతిక అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగినట్లు సంస్థ తెలిపింది.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా విద్యుత్ వినియోగం గణనీయంగా నమోదవుతోంది. సెప్టెంబర్ 29 (మంగళవారం) సాయంత్రం 6.42 గంటలకు 4,072 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైంది. అదే రోజు జీహెచ్‌ఎంసీ పరిధిలో 82.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో అత్యధిక డిమాండ్ మే 22వ తేదీన నమోదైంది. ఆ రోజు సాయంత్రం 3.33 గంటలకు 4,782 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదైంది. అదే రోజున 101.07 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది.తెలంగాణ మొత్తం మీద కూడా విద్యుత్ అవసరాలు భారీగా పెరుగుతున్నాయి. తెలంగాణ ట్రాన్స్‌కో స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 29 (మంగళవారం)న మధ్యాహ్నం 12.56 గంటలకు రాష్ట్రంలో 19,133 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైంది. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా 326.70 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు తెలంగాణలో అత్యధికంగా 19,543 మెగావాట్ల డిమాండ్ సెప్టెంబర్ 9వ తేదీన ఉదయం 10.41 గంటలకు నమోదైనట్లు అధికారులు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాల కోసం కూడా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ముఖ్యంగా వరి సహా వివిధ పంటల సాగు, నీటిపారుదల అవసరాల కోసం విద్యుత్ సరఫరాపై డిమాండ్ పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో సరఫరా వ్యవస్థను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇక పట్టణ ప్రాంతాల్లో గృహ, వాణిజ్య అవసరాలతో పాటు పారిశ్రామిక కార్యకలాపాలు, ఐటీ సంస్థలు, ఇతర వ్యాపార సంస్థల కారణంగా విద్యుత్ వినియోగం పెరుగుతోంది.పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడం, విద్యుత్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, ప్రసార-పంపిణీ వ్యవస్థలను ఆధునీకరించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో డేటా సెంటర్లు, ఐటీ పార్కులు, పారిశ్రామిక కారిడార్లు, మెట్రో విస్తరణ, వ్యవసాయం, పట్టణీకరణ వంటి కారణాలతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా మౌలిక వసతులను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.పెరుగుతున్న విద్యుత్ అవసరాలను ముందస్తు ప్రణాళిక, నెట్‌వర్క్ బలోపేతం, సమర్థవంతమైన నిర్వహణ ద్వారా తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన, విశ్వసనీయ, నిరంతరాయ విద్యుత్ అందించడమే లక్ష్యమని చెప్పారు. మొత్తంగా చూస్తే తెలంగాణలో విద్యుత్ అవసరాలు ఏ స్థాయిలో పెరుగుతున్నాయో తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు గృహ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో వినియోగం పెరుగుతుండగా మరోవైపు పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం కీలకంగా మారింది.

## ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే

# మహిళలతో కొట్టిస్తా

ఊరుకోం'అంటూ మాజీమంత్రి కొండా సురేఖ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.వరంగల్ జిల్లాలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను కొండా సురేఖ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తనకు మంత్రి పదవి పోవడం బాధగా లేదని చెప్పుకొచ్చారు. అయితే మంత్రిగా ఉంటే రాష్ట్రస్థాయిలో సేవచేసే అవకాశం తనకు ఉండేదని మాజీమంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

### మహిళలతో కొట్టిస్తా జాగ్రత్త

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ రాజకీయ ప్రత్యర్థులకు తనదైన స్టైల్‌లో వార్నింగ్ ఇచ్చారు.నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు.'రెండు రోజుల్లో ఊడిపోయేటోడు ఒకరున్నరు. నిన్న కాక మొన్న ఎక్కినోడు ఒకరున్నరు. నిన్న కాక మొన్న ఎక్కినోళ్లు అసలైనోళ్లా లేదా డూప్లికేటా మీరు ఆలోచించుకోవాలి. ఇంకోసారి మా ముందు కుప్పిగంతులేస్తే మాత్రం ఊరుకునేది లేదు'అని మాజీమంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు నోరు హద్దులో పెట్టుకొని మాట్లాడాలి నోరు జారి ఎవరినైనా ఏమైనా అంటే మాత్రం ఎక్కడ దొరికితే అక్కడ చిత్తు చిత్తులెక్క కొట్టి వదిలిపెడ్తరు. మిమ్మల్ని కొట్టాలంటే మగవాళ్లు అవసరం లేదు. ఆడవాళ్లే కొడ్తరు మా వెనక నిలబడ్డ మహిళలు చాలు ఒక్కక్కరు నలుగురిని కొడ్తరు. అంత దమ్ము ధైర్యం ఉన్నోళ్లున్నరు. ఇప్పటికైనా నోరు దగ్గర పెట్టుకోండి. ఇకముందు కొండా దంపతులకు సంబంధించిన వ్యక్తుల మీద ఈగ వాలినా ఊరుకునేది లేదు'అని మాజీమంత్రి కొండా సురేఖ హెచ్చరించారు.

### నా అనుచరులపై ఈగవాలిన ఊరుకోను

మరోవైపు వరంగల్ అభివృద్ధి విషయంలో బీజేపీకి మాజీమంత్రి కొండా సురేఖ సవాల్ విసిరారు.వాళ్లు వాళ్లే తోసేసుకుని పోలీసులు కొట్టారని ఆస్పత్రిలో జాయిన్ అయ్యారని కొండా సురేఖ విమర్శించారు. కొత్త కలెక్టరేట్ దగ్గర బీజేపీ నాయకులు నిరసన తెలిపి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ అభివృద్ధిపై బీజేపీ నాయకులకు సవాల్ చేశారు. వరంగల్‌లో పురాతన ప్రదేశాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి.. అప్పుడు మాట్లాడాలని కొండా సురేఖ సవాల్ విసిరారు. ఇప్పుడు వరంగల్ నియోజకవర్గంపై దృష్టి సారించి అభివృద్ధి చేసే అవకాశం తనకు వచ్చిందని కొండా సురేఖ వెల్లడించారు. ఇకపై నియోజకవర్గంలో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పుకొచ్చారు. వచ్చే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను గెలవడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. తమ అనుచరులపై ఈగవాలిన ఊరుకోబోమని హెచ్చరించారు. మొన్న ఎంజీఎం దగ్గర బీఆర్ఎస్ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారని మాజీమంత్రి కొండా సురేఖ ధ్వజమెత్తారు.

# రాజకీయాల కోసం దేవుళ్లను విడతీస్తావా

భక్తులమని, ఉత్తరాదిలో రాముడి భక్తులు ఎక్కువగా ఉంటారని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా, శివుడు పేదల దేవుడైతే, రాముడు సంపన్నుల దేవుడని చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. భారతీయ జనతా పార్టీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాముడిని ఉపయోగించుకుంటోందని, జై శ్రీరామ్ అంటూ లబ్ధిపొందుతూ రాజకీయాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయాల కోసం దేవుళ్లను, ప్రాంతాలను వర్గాలుగా విడదీయడం సరికాదని హితవు పలికారు.

తెలంగాణలోనే రాముడు, శివుడు ఇద్దరికీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయని ఈ సందర్భంగా బండి సంజయ్ గుర్తుచేశారు. వేములవాడను దక్షిణ కాశీగా, అదే విధంగా భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా భక్తులు ఆరాధించడం నిజం కాదా అని ప్రశ్నించారు. రాముడు, శివుడి ఏకత్వానికి ప్రతీకగా నిలిచే హరిహర క్షేత్రం మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్యంకొండలో ఉందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి చేసిన నార్త్-సౌత్, రాముడు-శివుడు అనే రాజకీయ విభజన అబద్ధమని నిరూపించేందుకు తెలంగాణలోని ఈ ఆధ్యాత్మిక క్షేత్రాలే సరైన సమాధానమని బండి సంజయ్ స్పష్టం చేశారు. అలాంటి ప్రాంతానికి ముఖ్యమంత్రిగా ఉండి రాముడు, శివుడిని ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలకు పరిమితం చేస్తూ ప్రజలను, ప్రాంతాలను ఎలా విడదీస్తారని బండి సంజయ్ ప్రశ్నించారు. సనాతన ధర్మంలో హరి, హరులకు భేదం లేదన్నారు.రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి మతపరమైన అంశాలను, గుర్తింపులను తెరపైకి తెస్తున్నారని బీజేపీ నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అయితే, రేవంత్ రెడ్డి వ్యాఖ్యల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఉత్తరాది, దక్షిణ రాష్ట్రాల మధ్య ఉన్న రాజకీయ వ్యూహాలు, బీజేపీ ఎన్నికల సరళి, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పై దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న ఆందోళనలను ఎత్తిచూపడమేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు వివాదం కేవలం ఆధ్యాత్మిక చర్చకే పరిమితం కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మాటల యుద్ధానికి దారితీసింది.

### ఢిల్లీ వేదికగా రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

ఢిల్లీలో జరిగిన ఓ మీడియా కార్యక్రమంలో రేవంత్ రెడ్డి. ఉత్తరాది, దక్షిణాది రాజకీయాలను ప్రస్తావిస్తూ తాము ద్రావిడులమని, ఉత్తరాది వారు ఆర్యులన్నారు. దక్షిణాది వారు శివ భక్తులమని, ఉత్తరాదిన రాముడ్ని పూజిస్తారని పేర్కొన్నారు. రాముడు ధనికుల దేవుడు కాగా, శివుడు పేదల దేవుడని బీజేపీ మాత్రం జైశ్రీరామ్ అంటూ రాముడి పేరుతో రాజకీయాలు చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. 'జై శ్రీరామ్' అనే బీజేపీ నేతలు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. అయితే రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు తెలంగాణ సీఎం తీరును తప్పుపడుతున్నారు.

# నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా

ఆమె ఆరోపించారు. పార్టీలో తనపై చర్యలు తీసుకున్న సందర్భాన్ని ప్రస్తావిస్తూ కేటీఆర్ తీరుపై ప్రశ్నలు సంధించారు. ఈ మేరకు ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తాను పార్టీలోని ఓ వ్యక్తిని అవినీతి ఆరోపణల నేపథ్యంలో విమర్శించిన కొద్ది గంటల్లోనే బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారని కవిత గుర్తు చేశారు. అదే సమయంలో అదే వ్యక్తితో సన్నిహితంగా వ్యవహరిస్తూ పార్టీ అధినేత తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని కేటీఆర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ఆమె ప్రశ్నించారు. కేసీఆర్‌ను కేటీఆర్ విమర్శించడం, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుపట్టడం కూడా పార్టీ వ్యతిరేక చర్య కాదా అని కవిత నిలదీశారు. ఈ క్రమంలోనే కేటీఆర్‌పై కవిత పలు రాజకీయ ఆరోపణలు కూడా చేశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ వీటన్నింటి కారణంగానే బీఆర్ఎస్ తీవ్రంగా నష్టపోయిందని ఆమె సంచలన వ్యాఖ్యలకు తెర తీశారు.ఇటీవల జరిగిన బీఆర్ఎస్ సమావేశాన్ని ప్రస్తావించిన కవిత అక్కడ ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో అతడి భార్యను అవమానించేలా మాట్లాడారని ఆరోపించారు. అలాగే సహాయం కోసం వచ్చిన ఓ మహిళను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల ద్వారా ఆమె తల్లిని కూడా అవమానించారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకుల ప్రవర్తన, ప్రజలతో వ్యవహరించే తీరుపై కూడా ఈ ఘటనలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కవిత వ్యాఖ్యానించారు. కేటీఆర్ ఒకరి మైండ్‌గేమ్‌లో పడి కేసీఆర్‌ను తప్పుపడుతున్నారని కవిత ఆరోపించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లుగా పార్టీలో జరిగిన వైఫల్యాలను, తమ చేతకానితనాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మోపుతున్నారని ఆమె విమర్శించారు. ప్రత్యక్ష రాజకీయాల్లో తమ స్థానం ఏమిటో అర్థం చేసుకోవాలని కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం చివరకు బీఆర్ఎస్‌కే నష్టం కలిగించే పరిస్థితికి దారితీస్తుందని ఆమె ఆరోపించారు.ఇటీవల జరిగిన గణేష్ నిమజ్జనోత్సవాన్ని కూడా కవిత తన వ్యాఖ్యల్లో ప్రస్తావించారు.

నిమజ్జన సమయంలో ఎంతమంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను బతిమాలుకున్నారో గణేష్ మహారాజుకు, వారి అంతరాత్మకు తెలుసని వ్యాఖ్యానించారు. తాను ఎవరో చెప్పిన మాటలు విని మాట్లాడే వ్యక్తిని కాదని నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతానని కవిత స్పష్టం చేశారు. చివరగా కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ 'నాతో పెట్టుకోకు' అంటూ తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. ఎమ్మెల్యేలే నియోజకవర్గానికి సీఎం అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన విషయాలను ఇటీవల గుర్తు చేసిన కేటీఆర్ అదే పార్టీ కొంప ముంచిందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలకు పెత్తనం ఇవ్వడమే తప్పు అయిందని పేర్కొన్నారు. ఇక అదే సమయంలో 3 ఏళ్లుగా కేసీఆర్ బయటికి రాకపోయినా ప్రజల్లో ఆయనపై ఉన్న అభిమానం ఏ మాత్రం తగ్గలేదని వెల్లడించారు. మరోవైపు గణేష్ నిమజ్జనాల్లో డబ్బులు ఇచ్చి కేసీఆర్ పాటలు వేయించారని కవిత చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన కేటీఆర్ డబ్బులు ఇస్తే అలా చేస్తారా అని ప్రశ్నించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ ఫుల్ ఫోకస్



## - 2 స్థానాలకు 6 పేర్లు, హైకమాండ్‌దే తుది నిర్ణయం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రంలో ఖాళీ కానున్న 2 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ పార్టీ కసరత్తును వేగవంతం చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయబోయే అభ్యర్థుల విషయంలో టీపీసీసీ ఆరుగురి పేర్లతో జాబితాను రెడీ చేసి హైకమాండ్‌కు పంపించింది. అయితే తుది అభ్యర్థులను ఏఐసీసీ ఖరారు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురి పేర్లను టీపీసీసీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, సామ రామ్మోహన్ రెడ్డి, గౌరీ సతీష్ పేర్లు ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఓసీ, బీసీ, ఎస్సీ వర్గాల నుంచి ఒక్కో పేరును ప్రతిపాదించినట్లు హస్తం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ముగ్గురిలో ఒకరిని అభ్యర్థిగా ఎంపిక చేసే అవకాశం ఉంది. అభ్యర్థి ఎంపిక బాధ్యతను మంత్రి దామోదర్ రాజనర్సింహకు అప్పగించింది. అదే విధంగా వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి కూడా ముగ్గురి పేర్లతో జాబితాను రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్, సూర్యాపేటకు చెందిన సర్వోత్తమ్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ స్థానానికి ఇద్దరు ఓసీ, ఒక బీసీ వర్గానికి చెందిన పేర్లను ప్రతిపాదించినట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలతో పాటు ప్రాంతీయ ప్రాతినిధ్యం, పార్టీతో అనుబంధం, గ్రాడ్యుయేట్లలో ఉన్న పరిచయం వంటి అంశాలను కాంగ్రెస్ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు త్వరలో ఖాళీ కానున్న గవర్నర్ కోటాలోని 3 ఎమ్మెల్సీ స్థానాలను కూడా కలిపి మొత్తం 5 స్థానాల్లో సామాజిక సమతుల్యత ఉండేలా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న ముగ్గురి పదవీకాలం నవంబర్‌లో ముగియనుంది. దీంతో ఈ 5 స్థానాల విషయంలో ఒకేసారి సామాజిక సమీకరణాలను పరిశీలించి అభ్యర్థుల ఎంపిక చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విషయంలో త్వరలోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. టీపీసీసీ సిద్ధం చేసిన ఆరుగురి పేర్ల జాబితాను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు పంపించారు. అభ్యర్థుల పేర్లు అధికారికంగా ప్రకటించకముందే ఆశావహులతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేసినా మిగిలిన ఆశావహులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఈసారి పాత ఓటర్ల జాబితాను కొనసాగించకుండా అర్హులైన పట్టభద్రులు కొత్తగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 2023 నవంబర్ 1వ తేదీ నాటికి లేదా అంతకంటే ముందే డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. నవంబర్ 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి.. ఆ తర్వాత డిసెంబర్ 10వ తేదీ వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. అనంతరం డిసెంబర్ 30వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు ఎన్నికల షెడ్యూల్‌లో పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ కూడా తమ కార్యకలాపాలను ముమ్మరం చేస్తున్నాయి. ఓటర్ల నమోదు ప్రక్రియపై ఆయా పార్టీల నేతలు దృష్టి పెట్టడంతో పాటు అభ్యర్థుల ఎంపికపై కూడా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు అధికంగా ఉండే ఈ నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియకు పార్టీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే కొత్త ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాతే నియోజకవర్గాల్లో నమోదైన ఓటర్ల సంఖ్య, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ప్రస్తుత సభ్యుల పదవీకాలం 2027 మార్చిలో ముగియనుంది. దీంతో ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతున్న కొద్దీ రాజకీయ పార్టీల ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల నమోదు వంటి అంశాలు మరింత కీలకంగా మారనున్నాయి.

# స్టాక్ మార్కెట్‌కు వరుసగా రెండో రోజు నష్టాలు

## - సెన్సెక్స్ 242 పాయింట్లు డౌన్



ముంబై (ప్రశ్న న్యూస్) భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. పెరిగిన ముడి చమురు ధరలు, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్‌లో కొనసాగుతున్న ఒడుదొడుకులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దీంతో పలు రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ 242.65 పాయింట్లు నష్టపోయి 72,529.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 64.05 పాయింట్లు తగ్గి 22,716.20 వద్ద ముగిసింది. నిఫ్టీలో టైటన్ కంపెనీ అత్యధికంగా నష్టపోయిన షేర్‌గా నిలిచింది. ఐటీ షేర్లలో విప్రో, హెచ్‌సీఎల్‌టెక్ కూడా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ అమ్మకాలు కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.99 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.81 శాతం పడిపోయాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, కెమికల్స్, రియల్టీ, ఐటీ రంగాలు ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు ఫార్మా షేర్లు మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చాయి. నిఫ్టీకి 22,750-22,800 స్థాయి తక్షణ నిరోధంగా ఉందని నిపుణులు తెలిపారు. 22,550-22,600 స్థాయి కీలక మద్దతుగా ఉందని పేర్కొన్నారు. 22,500 కంటే దిగువకు పడిపోతే అమ్మకాల ఒత్తిడి మరింత పెరిగి 22,300-22,000 ప్రాంతం వరకు సూచీ వెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు తెలిపారు. ఇదిలా ఉండగా, రూపాయి 95.97 వద్ద దాదాపు స్థిరంగా ట్రేడైంది.

# పట్టణ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు

## - టి-వర్క్స్‌తో సీఎంసీ అవగాహన ఒప్పందం



**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)** పట్టణ సమస్యలకు వినూత్న, సాంకేతిక ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), టి-వర్క్స్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. సీఎంసీ కమిషనర్ టి-వర్క్స్‌ను సందర్శించి అక్కడ రూపొందిస్తున్న వివిధ ప్రాజెక్టులు, నమూనా పరికరాలు, స్టార్టప్ కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో ముగ్గురు జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్ (ఆరోగ్యం, పారిశుధ్యం), చీఫ్ ఇంజనీర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న మున్సిపల్ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించి, వాటి నమూనాలను అభివృద్ధి చేసి పరీక్షించాలని సమావేశంలో నిర్ణయించారు. వినూత్న వీధి సౌకర్యాలు, ప్రజలకు అనుకూలమైన ప్రజా మూత్రశాలలు, గుంతల మరమ్మతులు, రహదారుల నిర్వహణ, దోమల నియంత్రణ, పారిశుధ్య సమస్యలకు సాంకేతిక పరిష్కారాలపై చర్చించారు.అలాగే నీటి కలుపు మొక్కల (వాటర్ హయాసింత్) నిర్వహణ, ఎత్తైన భవనాల్లో అగ్నిప్రమాదాల నియంత్రణ, పునర్వినియోగ పదార్థాల వినియోగం, ద్రవ వ్యర్థాల శుద్ధి తదితర అంశాలపై రూపొందిస్తున్న పరిష్కారాలను పరిశీలించారు. నమూనాలను క్షేత్రస్థాయిలో పరీక్షించి, సమర్థవంతమైన పరిష్కారాలను విస్తృతంగా అమలు చేయడం ద్వారా మున్సిపల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని సీఎంసీ పేర్కొంది.

# ఈనాడు శైలిలో కుదించి, వార్తాత్మకంగా ఇలా

## - అంబేడ్కర్ భావజాలంపై నిఘాను వ్యతిరేకించాలి

## - బీఎస్ఎఫ్--హెచ్‌సీయూ డిమాండ్




**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** విశ్వవిద్యాలయాల్లో డా. బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, పెరియార్ తదితరుల రచనలను బోధిస్తున్న కోర్సుల వివరాలు, వాటిలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను కోరడాన్ని బహుజన్ స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్ఎఫ్--హెచ్‌సీయూ) వ్యతిరేకించింది. సోషల్ మీడియా పోస్టును ఆధారంగా చేసుకుని కోర్సులపై సమీక్ష కోరడం ఆందోళన కలిగించే పరిణామమని పేర్కొంది.పాఠ్యాంశాలపై నిర్ణయాలు అధ్యాపకులు, విభాగాలు, బోర్డ్స్ ఆఫ్ స్టడీస్, అకడమిక్ కౌన్సిళ్ల వంటి విద్యా సంస్థల చర్చల ద్వారా జరగాలని తెలిపింది. అంబేడ్కర్, పూలే, పెరియార్ తదితరుల రచనలు కులం, అసమానత, వివక్ష, సామాజిక న్యాయం వంటి అంశాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయని పేర్కొంది. విద్యార్థులు ఒక ఆలోచనను చదివి, ప్రశ్నించి, విమర్శించే స్వేచ్ఛను కాపాడాలని కోరింది.విశ్వవిద్యాలయాల అకడమిక్ స్వయం ప్రతిపత్తిని గౌరవించాలని, విద్యార్థుల వివరాల సేకరణకు స్పష్టమైన విద్యా కారణాలు, విధివిధానాలను వెల్లడించాలని బీఎస్ఎఫ్--హెచ్‌సీయూ డిమాండ్ చేసింది. కుల వ్యతిరేక, బహుజన, దళిత, ఆదివాసీ, స్త్రీవాద అధ్యయనాలపై అనవసర జోక్యాన్ని నిలిపివేయాలని కోరింది.

# నల్లగండ్ల హుడా కాలనీలో చైన్ స్నాచింగ్



**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)** చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో మంగళవారం ఉదయం చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. ఉదయం సుమారు 7.40 గంటల సమయంలో 63 ఏళ్ల ఉమాదేవి అపార్ట్‌మెంట్ ఎదుట సీసీ రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని సుమారు 5.5 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు.ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ, సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటుకు సూచన..

కాలనీవాసులు ఇళ్ల ముందు, ఎడమ--కుడి వైపుల రహదారులను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. అలాగే ప్రతి కాలనీ చౌరస్తాలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాల దర్యాప్తులో ఫుటేజీ ఉపయోగపడుతుందని, నిందితులను త్వరగా గుర్తించేందుకు దోహదపడుతుందని తెలిపారు.

# కారులో మంటలు ఒకరు మృతి..

**గుంటూరు** ఇందిరా ప్రియదర్శిని కాలనీ సాయి బాబా దేవాలయం వద్ద ఘటన..మారుతి బ్యాలీనో కారులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు..కారు లో ఇద్దరు వ్యక్తులు వకరు తప్పించుకోగా మరొకరు కారులోనే అగ్నికి ఆహుతి..మృతుడు తాడికొండ హరికృష్ణ 53 గా గుర్తించిన లాలపేట పోలీసులు..గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తరలింపు..మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది..

# పాస్ పోస్టు జప్తు వార్తలు ఆవాస్తవం

**- కేటీఆర్ న్యాయవాదులు**

**హైదరాబాద్** కేటీఆర్ పాస్పోర్ట్ సీజ్ చేశారని పత్రికల్లో వస్తున్న వార్తలు అవాస్తవని న్యాయవాదులు అంటున్నారు.ఏసీబీ అధికారులు పాస్పోర్ట్ ప్రొటెక్షన్ కావాలని మెమో మాత్రమే ఫైల్ చేశారు. కేటీఆర్ కౌన్సిల్ తరపున మాకు ఇంకా నోటీసులు కూడా రాలేదు. నోటీసులు వచ్చాక కౌంటర్ ఫైల్ చేసి మా వాదనలు వినిపిస్తాం. ఆ తర్వాత కోర్టు పాస్పోర్ట్ను ప్రొడ్యూస్ చేయమని చెప్పొచ్చు లేదా ఆ పిటిషన్ను డిస్మిస్ చేయొచ్చు. ఆ కోర్టు ఆదేశాలు రాకముందే కేటీఆర్ పాస్పోర్ట్ను ప్రొటెక్ట్ చేయమని ఏసీబీ అధికారులు చెప్పారని పత్రికల్లో అవాస్తవాలు రాస్తున్నరని - అడ్వకేట్ జక్కుల లక్ష్మణ్ వివరణ ఇచ్చారు.

# ఖమ్మంలో పోలీసు అధికారుల బదిలీల కలకలం

**- నలుగురు సిఐలకు స్థానచలనం..**

**- ముగ్గురు ఐజీ ఆఫీస్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు**

పోలీసు కమిషనరేట్ పరిధిలో సి ఐ ల బదిలీలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మల్టీ జోన్-1 ఐజీ సంతోష్ చంద్రశేఖర్ రెడ్డి జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం పలువురు సిఐలను బదిలీ చేయగా, ముఖ్యంగా ఖమ్మం నగరంలో కీలక బాధ్యతల్లో పనిచేస్తున్న నలుగురు అధికారులకు స్థానచలనం కలిగింది. ఖమ్మం ఎఎ టౌన్ ఎస్‌హెచ్ఓగా పనిచేస్తున్న బొమ్మెర బాలకృష్ణ, ఖానాపురం హవేలీ ఎస్‌హెచ్ఓగా పనిచేస్తున్న రడం భానుప్రకాష్, ఖమ్మం ట్రాఫిక్ పిఎస్ ఎస్‌హెచ్ఓగా ఉన్న బెల్లం సత్యనారాయణకు అధికారులకు నూతన పోస్టింగ్‌లు కేటాయించకపోవడం పోలీసు వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.బదిలీ అయిన ఈ అధికారులను హైదరాబాద్‌లోని మల్టీ జోన్-1 ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. నగరంలోని నలుగురు సిఐల పరిధిలో కీలకమైన స్టేషన్ల బాధ్యతలు చూస్తున్న అధికారులలో ముగ్గురికి ఎలాంటి నూతన స్థానాలు కేటాయించకుండా నేరుగా ఐజీ ఆఫీస్‌కు రిపోర్ట్ చేయమనడం వెనుక కారణాలపై పోలీసు శాఖలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. రాజకీయ, పరిపాలనా కారణాలా లేక అంతర్గత వ్యవహారాల వల్ల పోస్టింగ్ ఇవ్వలేదా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.మరోవైపు నగరంలోని వివిధ స్టేషన్లకు కొత్త సిఐలను నియమించారు. సీఎస్‌బీలో పనిచేస్తున్న జ్ఞానదృష్టి రామకృష్ణను ఖమ్మం ఎఎ టౌన్ ఎస్‌హెచ్ఓగా, ఇంటెలిజెన్స్ విభాగం నుంచి వచ్చిన ఎండి. సాధిక్ పాషాను ఖమ్మం ఎ టౌన్ ఎస్‌హెచ్ఓగా నియమించారు. అలాగే ఖమ్మం ఎ టౌన్ ఎస్‌హెచ్ఓగా ఉన్న తాటిపాముల కరుణాకర్‌ను విఆర్ కు పంపి, రఘునాథపాలెం పిఎస్ అటాచ్‌మెంట్ ఇచ్చారు. ఉమెన్ పిఎస్ ఎస్‌హెచ్ఓగా ఉన్న నల్లమోతు చిట్టిబాబును ఖమ్మం ఎఎఎ టౌన్ ఎస్‌హెచ్ఓగా బదిలీ చేయగా ఖమ్మం ఎఎఎ టౌన్ ఎస్‌హెచ్ఓ జిల్లేళ్లమూడి మోహన్‌బాబును కూడా ఐజీ ఆఫీస్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. అలాగే సిటిసిలో ఉన్న కాగిటోజు శివప్రసాద్‌ను ట్రాఫిక్ పిఎస్ ఎస్‌హెచ్ఓగా నియమించారు. ఒకేసారి ఈ స్థాయిలో బదిలీలు జరగడం, అందులోనూ కీలక సీఐల్లో ముగ్గురికి స్థానచలనం కలిగి పోస్టింగ్ ఇవ్వకపోవడం ఖమ్మం నగర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది

# రాయదుర్గం మున్సిపల్ పీఠం ఎవరికో?

**- కూటమిలో జోరుగా చైర్మన్ సీటు వేట.. రిజర్వేషన్లపైనే నేతల కన్ను**

మున్సిపల్ ఎన్నికల నగారా త్వరలోనే మోగనుండటంతో అనంతపురం జిల్లా రాయదుర్గం పురపాలక సంఘంలో రాజకీయ వేడి రాజుకుంది. వచ్చే అక్టోబరులో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా, కూటమి పార్టీల్లో చైర్మన్ పీఠం కోసం తీవ్ర పోటీ నెలకొంది.మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డుల్లో మొత్తం 53,696 మంది ఓటర్లు ఉండగా, 80 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే, చైర్మన్ సీటు రిజర్వేషన్ ఖరారు కాకముందే ప్రధాన కూటమి పార్టీలైన తెదేపా, జనసేన, భాజపాల్లో ఆశావాహులు తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.తెదేపాలో జోరుగా లాబీయింగ్..చైర్మన్ పీఠం తమకే దక్కుతుందన్న ధీమాతో తెదేపాలోని పలువురు సీనియర్ నాయకులు సీటు కోసం పట్టుబడుతున్నారు. ?చేనేత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, గార్మెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు రేసులో ముందు వరుసలో ఉన్నారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరల పురుషోత్తం కూడా పార్టీకి చేసిన సేవలను గుర్తిస్తూ తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మహిళలకు రిజర్వేషన్ కేటాయిస్తే రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలిచిన అనుభవం ఉన్న కురుబ ప్రశాంతి తనకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. ఓసీ జనరల్ అయితే, పేదలకు అందించిన ఉచిత వైద్య సేవలను పరిగణనలోకి తీసుకుని అవకాశం ఇవ్వాలని డాక్టర్ శ్రీరామరెడ్డి అధిష్టానం వద్ద మంతనాలు జరుపుతున్నారు. మైనారిటీ కోటాలో మాజీ వైస్ చైర్మన్, తెదేపా జిల్లా కోశాధికారి కడ్డిపూడి మహబూబ్ బాషా టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీరితో పాటు బండి భారతి, బండి కృష్ణమూర్తి, బంగి ఉమాశంకర్, పద్మజ తదితరుల పేర్లు చర్చల్లో ఉన్నాయి.పొత్తులో మాకంటే మాకంటూ..పొత్తులో భాగంగా ఈసారి తమకే చైర్మన్ సీటు కేటాయించాలని జనసేన, భాజపాలు గట్టిగా కోరుతున్నాయి. జనసేనకు కేటాయిస్తే ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కరేగౌడరావు మంజునాథ్ పేరు ఖరారయ్యే అవకాశాలున్నాయి. మరోవైపు భాజపా కూడా పట్టుబడుతుండటంతో ఆ పార్టీ తరపున జీవి నాయుడు (నాని) పేరు బలంగా వినిపిస్తోంది. అధిష్టాన నిర్ణయానికే కట్టుబడి ఉంటామని జింకా వసుంధర స్పష్టం చేశారు.ఏదేమైనా, ప్రభుత్వం అధికారికంగా రిజర్వేషన్లను ఖరారు చేసిన అనంతరమే రాయదుర్గం మున్సిపల్ పీఠం ఎవరికి దక్కుతుందనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

# మండల వ్యాప్తంగా విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు పూర్తి

**- 63 పాఠశాలలకు నూతన విద్యా కమిటీలు,2 చోట్ల వాయిదా.**

**- మండల విద్యాధికారులు ప్రవీణ, రమా వెంకటేశ్వర్లు.**




**తుగ్గలి:** తుగ్గలి మండల వ్యాప్తంగా మంగళవారం రోజు నిర్వహించిన విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు ముగిశాయని మండల విద్యాధికారులు ప్రవీణ, రమా వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతుగ్గలి మండలంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని వారు తెలియజేశారు.మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో మండలంలోని మొత్తం 65 ప్రభుత్వ పాఠశాలల్లోఎంపీపీఎస్,ఎంపియుపిస్, జడ్.పి.హెచ్.ఎస్,కేజీబీవీ,ఆశ్రమ పాఠశాలలో ఎన్నికల ప్రక్రియ చేపట్టగా,63 పాఠశాలల్లో నూతన చైర్మన్లు,వైస్ చైర్మన్ల ఎన్నికలు పూర్తయ్యాయని వారు తెలియజేశారు.మండల పరిధిలోని గల రామాపురం ఎంపియుపిఎస్ పాఠశాల యందు రాజకీయ సమస్య కారణంగా,ముక్కెళ్ల జడ్పీ హైస్కూల్ నందు కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు వారు తెలియజేశారు. వాయిదా పడిన రెండు పాఠశాలల్లో త్వరలోనే తిరిగి ఎన్నికలు నిర్వహించి పూర్తి చేస్తామని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.విద్యా కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్ లుగా ఎన్నికైన సభ్యులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,నాయకులు ఘనంగా సన్మానించారు.ఎన్నికైన నూతన కమిటీలు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల హాజరు,మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ,మౌలిక వసతుల కల్పనలో కీలక పాత్ర పోషించనున్నాయి.ఈ కార్యక్రమంలో

## చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల

# విద్యా కమిటీ చైర్మన్ ఏకగ్రీవం



**చాగలమర్రి** చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవయ్య ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్ గా కసినేని ఓబులేసు, ఉపాధ్యక్షులుగా అమీర్, సభ్యులుగా కింగ్ హుస్సేన్, నూరి, రమణ, లక్ష్మినారాయణ రెడ్డి, గౌసియా, అంజనమ్మ, శారద, జ్యోతి, గంగాదేవి తదితరులు ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా చైర్మన్ గా ఎన్నికైన కసినేని ఓబులేసు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అన్ని రకాలుగా తాను కృషి చేస్తానని , ఈ అవకాశం కల్పించిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు , నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, చాగలమర్రి టిడిపి పట్టణ అధ్యక్షులు మౌలాలి, వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, టైలర్ భాష, సయ్యద్ బషీర్, బాల దస్తగిరి, పీరయ్య, కింగ్ హుస్సేన్, కలాంబిడి బషీర్, దస్తగిరి, సుద్ధపల్లి వలి, మోహన్, సురేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన మాజీ మంత్రి.సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.

**వనపర్తి.**స్వయంగా ఓటు నమోదుకు శ్రీకారం చుట్టిన గనిరంజన్ రెడ్డి.హైదరాబాద్, రంగారెడ్డి,మహబూబ్ నగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను తన స్వగృహంలో ప్రారంభించారు.తనతో పాటు గ్రాడ్యుయేట్ ఓటర్లకు అవగాహన కల్పించి స్వయంగా ఓటు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియ అత్యంత కీలకమైందని బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని,నవంబర్ 2023 వరకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు అర్హులు అవుతారని కాబట్టి ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి,ప్రజాస్వామ్య మనుగడకు ఏకైక ఆయుధమని కాబట్టి విజ్ఞులు గ్రాడ్యుయేట్ ఎన్నికలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ఓటు నమోదు చేసుకున్న వారిలో నందిమల్ల.అశోక్, కౌన్సిలర్.శ్రీకర్ గౌడ్,పలుస.శంకర్ గౌడ్,వెంకట్ సాగర్, ఉంగ్లం. తిరుమల్,సూర్యవంశం .గిరి, జోహెబ్ హుస్సేన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి.శ్రీధర్, కె.మాణిక్యం,ధర్మా నాయక్, మహేశ్వర్ రెడ్డి,దేవర్ల.నరసింహ,నీలస్వామి, మంద.రాము ఉన్నారు.

# పేట హై స్కూల్‌లో పూర్వ విద్యార్థుల తరఫున ప్రతినిధిగా స్టార్ కృష్ణ!.



**ఏర్పేడు** ఏర్పేడు మండలం, పాపానాయుడు హై స్కూల్ లో ఈ రోజు అనగా మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారయ్య అధ్యక్షతన జరిగిన ఎస్ఎంసి ఎన్నికలలో పూర్వ విద్యార్థుల తరఫున ప్రతినిధిగా ( సభ్యునిగా) అంబేడ్కర్ స్టార్ కృష్ణ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.కమిటీ చైర్మన్ గా రోశయ్య వైస్ చైర్మన్ గా షామి లను, మరో పదమూడు మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా స్టార్ కృష్ణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన కమిటీ చిత్త శుద్ధిగా పనిచేస్తుందని తెలిపారు. అంతేకాకుండా పూర్వ విద్యార్థులను అందరినీ ఏకంచేసి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణప్ప మొదలి, అర్జున్ బాబు, రవి, దొరవెలు, కృష్ణయ్య, టీచర్లు ప్రసాద్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కాలువలోకి డ్రైనేజీ నీరు..

**- వెంటనే స్పందించిన మున్సిపల్ అధికారులు**

**- కాలువను శుభ్రం చేసిన సిబ్బంది..**

**- శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల విజ్ఞప్తి**



**తిరుపతి** న్యూఇందిరానగర్ ప్రాంతంలోని సైడ్ కాలువలో మురుగునీరు నిలిచిపోయిన సమస్యపై మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారు. సమస్యపై సమాచారం అందిన వెంటనే సంజయ్ గారు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పందించి సిబ్బందిని కాలువను శుభ్రం చేయించారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.అయితే డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి మల వ్యర్థాలు కాలువలోకి చేరుతున్న సమస్యకు ప్రస్తుతం చేపట్టిన చర్య తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని స్థానికులు పేర్కొంటున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి కాలువ వైపు వస్తున్న పైపును మళ్లించి, మల వ్యర్థాలు కాలువలోకి రాకుండా ప్రస్తుతం అడ్డుకోవడం జరిగిందని తెలిపారు.మళ్లీ ఇదే సమస్య తలెత్తకుండా డ్రైనేజీ పైప్‌లైన్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి, మల వ్యర్థాలు కాలువలోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై వెంటనే స్పందించి కాలువను శుభ్రం చేయించిన సంజయ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన సమస్యకు కూడా త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

# తుగ్గలి బీసీ కాలనీ ప్రధాన రహదారికి మహర్దశ

**- 40 లక్షల సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర,మాజీ జెడ్పిటిసి వరలక్ష్మి.**



**తుగ్గలి:** మండల కేంద్రమైన తుగ్గలిలోని గల బీసీ కాలనీ వాసుల చిరకాల కోరిక నెరవేరింది. ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, తుగ్గలి మాజీ జెడ్పిటిసి సభ్యురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం రోజున ఘనంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు కృషితోనే ఈ సీసీ రోడ్డు మంజూరైందని,కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని అన్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన కాలనీలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని,రాబోయే రోజుల్లో తుగ్గలి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వారు హామీ ఇచ్చారు. బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణంతో రాకపోకలకు ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీసీ కాలనీవాసులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ నివాసులు,టీడీపీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోషక ఆహారమే ఆరోగ్యానికి పునాది



**బేతంచెర్ల :**పోషక ఆహారంతోనేచిన్నారులు,బాలింతలు,గర్భిణీలు,కిషోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని సూపర్వైజర్ అరుణ,పీహెచ్‌సీ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి,తెలిపారు.మంగళవారం మండలంలోని అంబాపురం గ్రామంలో అంగన్వాడీ ఉత్సవాలునిర్వహించారు.వారు మాట్లాడుతూ 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ వరకు అంగన్వాడీ ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు.మాతృ సంరక్షణ,పోషణ,శిశు అభివృద్ధి,టీకాలు,మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.సమాజ సేవలోఅంగన్వాడీ సెంటర్లు ఎంతో కీలకమని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి,అంగన్వాడీ టీచర్లు చందన,రమాదేవి,ఆశా వర్కర్లు పుల్లమ్మ,మహేశ్వరి,పాల్గొన్నారు.

# జంప్ రోప్ పోటీల్లో ప్రతాపం చూపిన 11 మంది రెయిన్‌బో విద్యార్థులు



**రేణిగుంట** అన్నమయ్య జంప్ రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ సబ్-జూనియర్ ఇంటర్-డిస్ట్రిక్ట్ జంప్ రోప్ ఛాంపియన్‌షిప్ ఆంధ్రప్రదేశ్ పోటీల్లో రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-12, అండర్-14 విభాగాల్లో విశేష ప్రతిభ చాటిన 11 మంది విద్యార్థులు నేషనల్స్ కు అర్హత సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.?జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలు ?బాలికల విభాగం దీప్తి హనీ కె. (8వ తరగతి), కీర్తి కె. (8వ తరగతి), కారుణ్య ఎస్. (7వ తరగతి), దీపాన్విత కె. (8వ తరగతి), ప్రణవి కె. (8వ తరగతి), జ్ఞాపిక ఎన్. (7వ తరగతి).?బాలుర విభాగం..కె.ఎం.డి. రిహాన్ (9వ తరగతి), దీక్షిత్ కుమార్ (8వ తరగతి), ఎస్. ముస్తఫా (7వ తరగతి), ఎండి. ఖదీర్ (8వ తరగతి), బి. ఎస్లినక్షత్ర (8వ తరగతి).?ఈ జాతీయ స్థాయి పోటీలు మహారాష్ట్రలోని నాందేడ్ లో అక్టోబర్ 29 నుండి నవంబర్ ఒకటో 1 వరకు జరగనున్నాయి.?ఈ సందర్భంగా రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరెస్పాండెంట్ శ్రీ పి.ఎ. ఖాన్ మాట్లాడుతూ.. విద్యార్థులను అంకితభావంతో తీర్చిదిద్దిన కోచ్ రెడ్డి కుమార్ కి, విద్యార్థుల క్రీడా ప్రతిభను నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లోనూ తమ విద్యార్థులు పాల్గొని మెడల్స్ సాధిస్తారని, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నామమును సగర్వంగా నిలబెడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**బేతంచెర్ల** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

మంగళవారం బేతంచెర్ల మండల పరిధిలోని ఎంబాయి,బైనపల్లె, శంకలాపురం,మండ్లవానిపల్లె, సీతారామపురం,గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోట్ల శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు,డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోరహదారులు,డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల అవసరాలను గుర్తించి దశలవారీగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కన్వీనర్,మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ ఎల్ల నాగయ్య,ఎంపీడీవో ఫజల్ రహిమాన్,డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున పంచాయతీరాజ్ ఇంజనీర్ మహేష్,ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి,ఈశ్వరప్ప,శివయ్య,శేఖర్,మహేష్, మల్లికార్జున,వెంకట రాముడు,అశ్వత్ నారాయణ,మద్దయ్య,అధికారులు,కూటమి నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# రంగంపేట సొసైటీలో మహాజనసభ.

**4 కోట్ల వ్యయంతో 5 వేల మెట్రిక్ టన్నుల గోదాం మంజూరు**

**సొసైటీ చైర్మన్ అరిగె రమేష్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రంగంపేట్ ప్రాథమిక రైతు సహకార సంఘం పరిధిలోని రైతులకు శుభవార్త 4 కోట్ల వ్యయం తో 5 వేల మెట్రిక్ టన్నుల గోదాం మంజూరు అయ్యింది అని అలాగే, సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల సౌలభ్యం కోసం ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ ను అందుబాటులో ఉంచుతామని కొల్చారం మండలం రంగంపేట సొసైటీ చేర్మెన్ అరిగే రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం నాడు కొల్చారం మండలం రంగంపేట సొసైటీ అధ్యక్షుడు అరిగే రమేష్ అధ్యక్షత న మహాజన సర్వసభ్య సమావేశన్నీ ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి పాలక మండలి డైరెక్టర్లు, తో పాటు రైతులు హాజరయ్యారు. పలు ఖిలక అంశాల పై సమావేశం లో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు అరిగే రమేష్ కుమార్ మాట్లాడుతూ పూర్వీకుల సమయ స్ఫూర్తితో సొసైటీకి స్థలం ఉంచడంతో 5వేల మెట్రిక్ టన్నుల గోదాం మంజూరు అయ్యింది అని తెలిపారు. ఇక నుండి సొసైటీ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ ను రైతులకు అందుబాటులో ఉంచుతాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ నవీన్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు మోత్కు మల్లేశం, డైరెక్టర్లు లింగన్నగారి ప్రవీణ్ రెడ్డి,ఏర్పుల రమేష్, గోపిగారి దుర్గేష్, లంబడి బుజ్జి బాయి,జనార్ధన్ గౌడ్, సాయిలు,జీవయ్య,ఎలుక పాపమ్మ, ఆకుల రమేష్, మంగగారి సంఘమేశ్వర్ రెడ్డి, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి, తుక్కపూర్ సర్పంచ్ ఆంజనేయులు తో పాటు రైతులు రవీందర్ గౌడ్, దుర్గేష్, రమేష్ జనార్దన్ రెడ్డి, అల్లు మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న తర్వాత నేతన్నదే కీలక పాత్ర

**మగ్గాన్ని వదలకు.. మగ్గమే నీ ఆయుధం, మగ్గమే నీ భవిష్యత్తు**

**చేనేత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి : చేనేత, జౌళి శాఖ అభివృద్ధి అధికారి శాంతమ్మ**

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మనిషి మనుగడకు కూడు, గూడు, గుడ్డ ఎంతో అవసరమని, రైతన్న తర్వాత సమాజంలో నేతన్నకు కూడా ఎంతో ప్రాముఖ్యత ఉందని సిద్దిపేట జిల్లా చేనేత, జౌళి శాఖ అభివృద్ధి అధికారి బి. శాంతమ్మ అన్నారు.గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చేనేత పారిశ్రామిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బి. శాంతమ్మ మాట్లాడుతూ చేనేత కార్మికుల కృషిని కొనియాడారు. పద్మశాలి కార్మికులు తరతరాలుగా వస్త్రాలను నేస్తూ సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. సిరిసిల్ల పద్మశాలి కార్మికులు నేసిన చేనేత పట్టు వస్త్రాలకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు.ఈ సందర్భంగా ప్రముఖ హైకోర్టు న్యాయవాది తలకొక్కుల రాజు మాట్లాడుతూ చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, వారికి నిరంతర ఉపాధి కల్పించేందుకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషిని గుర్తుచేశారు.

"బిడ్డా.. మగ్గాన్ని వదలకు.. మగ్గమే నీ ఆయుధం.. మగ్గమే నీ భవిష్యత్తు" అనే బాపూజీ స్ఫూర్తితో చేనేత రంగాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

చేనేత వస్త్రాలతో పోలిస్తే తక్కువ ధరకు లభించే వస్త్రాలతో పోటీ పడేందుకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందించి, చేనేత నిరుద్యోగ యువతకు పవర్‌లూమ్‌లను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో మాదిరిగా ఇంటింటికీ



పవర్‌లూమ్ సౌకర్యం కల్పిస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్షులు బొల్లిబత్తుల దేవదాస్, ఉపాధ్యక్షులు వల్లం దాస్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎలగందుల రామచంద్రం, కోశాధికారి వడ్లకొండ ప్రసాద్, డైరెక్టర్లు గాడిపల్లి విజయ్, చెప్యాల మల్లేశం, మహిళా డైరెక్టర్లు అమృతమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు దేవులపల్లి రాజారామ్, మార్కండేయ గుడి అధ్యక్షులు గడ్డమీది ఆంజనేయులు, కుల పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, చేనేత కార్మికులు, పద్మశాలి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# క్లస్టర్-3లో మెదక్ షీ టీమ్‌కు ప్రథమ స్థానం

**మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్ నివారణలో విశేష ప్రతిభ**

**అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్: మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్ నివారణ, అవగాహన కార్యక్రమాల్లో మెదక్ జిల్లా షీ టీమ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్లస్టర్-3లో ప్రథమ స్థానంలో నిలిచింది. గత ఎనిమిది నెలలుగా షీ టీమ్ చేపట్టిన నిరంతర పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, సమర్థవంతమైన చర్యలకు ఈ గుర్తింపు నిదర్శనమని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు.మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ విద్యాసంస్థలు, బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో నిఘా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈవ్‌టీజింగ్, మహిళల వేధింపులను అరికట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.ప్రథమ స్థానం సాధించిన షీ టీమ్ సిబ్బందిని అదనపు ఎస్పీ అభినందించారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి మహిళలకు మరింత భద్రత కల్పించాలని సూచించారు.

# అంగన్వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్- తల్లులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి- పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి**

ఎల్లారెడిపేట (ప్రశ్న న్యూస్) అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. 9వ పోషణ మాసంలో భాగంగా మన అంగన్వాడీ మన బాధ్యత కింద ఎల్లారెడిపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యతను గర్భిణులు బాలింతలు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. పోషణ మాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, బెల్లం, నువ్వులు బాలామృతంతో సిద్ధం చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని అన్నారు. జిల్లాలో మొత్తం586 కేంద్రాలు ఉన్నాయని, పిల్లలు, గర్భిణులు, బాలింతలు కలిపి 40 వేల మంది సేవలు పొందుతున్నారని తెలిపారు ఇంట్లో, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలా తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు నమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని, దీంతో వారి బంగారు భవితకు బాటలు పడతాయని స్పష్టం చేశారు. ప్రతి నెల పిల్లల ఎత్తు, బరువు నమోదు చేయడంతో వారికి అంగన్వాడి కేంద్రంలో బాలామృతంతో పాటు ఇతర పోషక ప్రాంతాలు అందిస్తారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. సూపర్ వైజర్లు, సీడీపీఓలు తమ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీ చేయాలని అన్నారు.పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు తల్లితండ్రుల ఇద్దరి బాధ్యతని పేర్కొన్నారు. బాలల మొదటి వెయ్యి రోజుల దశ కీలకమని, వారికి సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు. చక్కర పదార్థాలు ఇవ్వకూడదని తెలిపారు.

### తల్లులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి

దేశంలో దాదాపు 54 శాతం మంది మహిళలు రక్త హీనతతో బాధపడుతున్నారని, రక్త హీనతతో ఉన్న మహిళలు ప్రతి ఆరు నెలల ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏ ఎన్ సీ పరీక్షలకు వచ్చే గర్భిణులకు భోజనం ఇవ్వాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేకత పెట్టారని తెలిపారు.

### అంగన్వాడి కేంద్రాల వారికి సమాచారం ఇవ్వాలి

5 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలు ఎదుగుదల లోపిస్తే సమీప అంగన్వాడి కేంద్రాల వారికి సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎదుగుదల లోపాలు గల పిల్లలు, చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల, నడవలేని



వాళ్లు, పుట్టుకతో వచ్చే లోపల గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్యలు సమస్య, సరిగా మాట్లాడాలని పిల్లలు, రక్తహీనత పోషకాహారం లోపం గల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాన్ని గుర్తిస్తారని తెలిపారు. ఆర్ బీ ఎస్ కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు. వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. సేవలను సద్వినియం చేసుకోవాలని సూచించారు. అలాగే కరీంనగర్ లో ఎన్ ఆర్ సీ కేంద్రంలో సేవలు అందిస్తారని, ఉన్నత వైద్య సేవలు హైదరాబాద్ లో అందిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, తహసీల్దార్ రజనీ, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శ..

**బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా.**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, కష్టసమయంలో బాధితులకు ధైర్యం కల్పించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శలు కొనసాగిస్తున్నారు. మంగళవారం పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామంలో మోహన్‌రావు అత్తమ్మ, మరియు పుట్టి.మల్లేశం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకుని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు వడ్ల.కుబేరుడు, కుర్తివాడ పార్టీ అధ్యక్షులు వెంకటేశం,మాజీ సర్పంచ్ స్రవంతి శ్రీనివాస్, నాయకులు కిష్టా గౌడ్,పోతా గౌడ్, బొందయ్య,మధునారాయణ, వడ్లబ్రహ్మం, కమ్మరి బ్రహ్మం, వార్డు సభ్యులు సాయవ్వ, నర్సింలు, మీనా రాజు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు..

# 30న హైదరాబాద్‌లో అఖిలపక్ష మహా ధర్నా

**ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ : నీరుడి స్వామి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియను నిలిపివేయాలని, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 30న హైదరాబాద్‌లో అఖిలపక్ష మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి తెలిపారు.తెలంగాణ జన సమితి, వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర పార్టీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు.సెప్టెంబర్ 30న ఉదయం 10 గంటలకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి బీఆర్కే భవన్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని నీరుడి స్వామి కోరారు.

# రాజన్న దర్శనం ఎప్పుడు కల్పిస్తారు..?

**సీఎం సభ వేదికగా ప్రజలకు సమాధానం చెప్పాలి**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్.**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ముఖ్యమంత్రి బహిరంగ సభ వేదికగా స్పష్టమైన సమాధానం ఇవ్వాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని గోపి విమర్శించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

### రాజన్న మూలవిరాట్ దర్శనం ఎప్పుడు..?

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గత పది నెలలుగా మూలవిరాట్ దర్శనం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు, మనోవేదనకు గురవుతున్నారని గోపి తెలిపారు. రాజన్న మూలవిరాట్ దర్శనాన్ని భక్తులకు తిరిగి ఎప్పటి నుంచి అందుబాటులోకి తీసుకువస్తారో ముఖ్యమంత్రి స్పష్టమైన తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### నూలు డిపోను సిరిసిల్లకు తీసుకురావాలి

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు నూలు డిపో ఎంతో కీలకమని, నూలు అవసరాల్లో అధిక భాగం సిరిసిల్లలోనే ఉన్నప్పటికీ డిపోను వేములవాడకు తరలించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని గోపి అన్నారు. నూలు డిపోను తిరిగి సిరిసిల్లకు ఎప్పుడు తీసుకువస్తారో సీఎం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

### 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి

గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో ఇచ్చిన హామీ మేరకు కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కోరారు. పనులు పూర్తికాకపోవడంతో సాగునీరు అందక రైతులు రెండో పంట సాగు చేయలేక నష్టపోతున్నారని తెలిపారు.రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో ఇప్పటికే పాదయాత్ర నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశామని గోపి తెలిపారు. రాజన్న దర్శనం, నూలు డిపో, 9వ ప్యాకేజీ పనులు-ఈ మూడు ప్రధాన సమస్యలపై ముఖ్యమంత్రి రేపటి బహిరంగ సభ వేదికగా స్పష్టమైన ప్రకటన చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. సీఎం స్పందించకపోతే ప్రజల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం

**సిరిసిల్లలో భారీ బహిరంగ సభ**

**విద్య, ఆలయ అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాలకు ప్రాధాన్యం**



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లాలో అభివృద్ధి పనులకు మరో ముందడుగు పడనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా సిరిసిల్లకు రానున్న రేవంత్ రెడ్డి. జిల్లా కేంద్రంలోని రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నారు. దీంతో ముఖ్యమంత్రి పర్యటనపై జిల్లా ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

### విద్యారంగానికి రూ.200 కోట్ల ప్రాధాన్యం

విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ పాఠశాలలు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించే అవకాశం ఉంటుంది.

### రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రూ.99.40 కోట్లు

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా రూ.99.40 కోట్లతో చేపట్టనున్న 26 అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఈ పనులు చేపట్టనున్నారు.

### ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు

జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా పలు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాలు, నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. ఒకే వేదికపై విద్య, దేవాలయ అభివృద్ధి, పరిపాలనా మౌలిక వసతులకు సంబంధించిన భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనుండటంతో సీఎం పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



# నాన్న డబ్బులిస్తేనే ఆ సినిమాలో నటిస్తానని చెప్పా: విక్టరీ వెంకటేశ్

టాలీవుడ్ కథానాయకుడు విక్టరీ వెంకటేశ్ తన చిన్ననాటి ఒక మధుర జ్ఞాపకాన్ని అభిమానులతో పంచుకున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా, శ్రీనిధి శెట్టి కథానాయికగా నటించిన చిత్రం 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం. 47'. ఈ చిత్రం అక్టోబర్ 9న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ప్రముఖ యాంకర్ సుమ కనకాలకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వెంకటేశ్ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సుమ, 'ప్రేమ నగర్' చిత్రంలో బాలనటుడిగా ఉన్నప్పటి ఫోటోను చూపించగా, వెంకటేశ్ ఆ నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. "ఒకరోజు నేను పాఠశాలలో ఆడుకుంటుండగా, మా ఫ్యామిలీ మేనేజర్ వచ్చి నాన్న (డి. రామానాయుడు) పిలుస్తున్నారని చెప్పారు. ఎందుకని ఆరా తీయగా, సినిమాలో ఒక చిన్న పాత్రలో నటించాలని తెలిపారు. అప్పట్లో మా నాన్న షూటింగ్ ముగిశాక జూనియర్ ఆర్టిస్టులకు పారితోషికం పంపిణీ చేయడం నాకు గుర్తుంది. దాంతో నేను కూడా, 'నాకు కూడా డబ్బులు ఇస్తారా?' అని అడిగాను" అని వెంకటేశ్ నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. మేనేజర్ ఆ విషయాన్ని తన తండ్రికి చెప్పగా, ఆయన నాకు 1,000 రూపాయలను పారితోషికంగా ఇచ్చారని వెంకటేశ్ తెలిపారు. ఆ తర్వాతే 'ప్రేమ నగర్' సినిమాలో కైకాల సత్యనారాయణ చిన్నప్పటి పాత్రలో నటించానని ఆయన వివరించారు. వెంకటేశ్ పంచుకున్న ఈ సరదా సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# ఈ అవార్డు వారికే అంకితం

బాలీవుడ్ నటి తాప్సీ పన్ను సంతోషంలో మునిగి తేలుతున్నది. ఆమె నటించిన తాజా సినిమా 'గాంధారి' ఇటీవలే ఓటీటీలో విడుదలై విశేష స్పందన చూరగొనడమేకాక, కథానాయిక తాప్సీకి 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్ -- 2026' అవార్డుని కూడా కట్టబెట్టింది. ఈ సందర్భంగా తాప్సీ మాట్లాడుతూ 'ఎలాంటి ప్లానింగ్ లేకుండానే నా సినీప్రయాణం మొదలైంది. ప్రతి ఏడాదీ నేను ఏదో ఒక అవార్డు గెలుచుకుంటున్నానంటే కారణం, నా తోటి నటీమణులే. వాళ్లు తమ అభినయంతో ప్రమాణాలకు పెంచకపోతే.. వాటిని అందుకునేందుకు నేను శ్రమించేదాన్ని కాదేమో. ఇండస్ట్రీలో మంచి పాత్రల కోసం తపించే ప్రతి మహిళకూ ఈ అవార్డు అంకితం. నా చుట్టూ ఉన్న సాధారణ మహిళల జీవితాలే నా పాత్రలకు ప్రేరణ. ఆ జీవితాలను తెరపై ప్రతిబింబించడమే నాలక్ష్యం' అంటూ చెప్పుకొచ్చింది తాప్సీ పన్ను.



# ఆ మాటకు అర్థం తెలిసింది!



'డ్రాగన్' చిత్రంతో యువతరానికి దగ్గరైంది అస్సామీ సొగసరి కయాదు లోహర్. ఇటీవల విడుదలైన 'ది ప్యారడైజ్' చిత్రంలో సుబ్బలక్ష్మిగా ఆమె ఆకట్టుకుంటున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సినిమాలోని తన పాత్ర, దర్శకుడి పనితీరుపై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 'కథ చెప్పే సమయంలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల 'నా వర్కింగ్‌స్టైల్ విభిన్నంగా ఉంటుంది. సినిమా విషయంలో నేను కాస్త 'మ్యాడ్'గా ఉంటాను. నాస్టైల్‌కు సిద్ధంగా ఉంటేనే ముందుకు రండి' అంటూ సున్నితంగా హెచ్చరించారు. సినిమా షూటింగ్‌లో దర్శకుడు పనితీరు ఏమిటో తెలిసింది. 'మ్యాడ్' అనే మాటకు అసలైన అర్థం తెలుసుకున్నా. అవుట్‌పుట్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తీవ్రంగా శ్రమిస్తాడాయన. ఈ సినిమాలో చేసిన పాత్ర పట్ల సంతోషంగా ఉన్నా' అని కయాదు లోహర్ ఆనందం వ్యక్తం చేసింది.

# 'హుంకార్ : ది రోర్' సిరీస్ రివ్యూ!



ఈ మధ్య కాలంలో మళ్లీ కోర్టు రూమ్ డ్రామాలు జోరందుకున్నాయి. ఈ జోనర్ కి సంబంధించిన సిరీస్ లు హిందీ నుంచి ఎక్కువగా వస్తున్నాయి. థ్రిల్లర్ జోనర్ ను కూడా టచ్ చేస్తూ సాగే ఈ సిరీస్ పేరే 'హుంకార్: ది రోర్'. అనీత్ పడ్డా – ఫాతిమా సనాషేక్ ప్రధానమైన పాత్రలను పోషించారు. కరణ్ .. హీరజ్ .. నిత్య మెహ్రా దర్శకత్వం వహించిన ఈ సిరీస్, ఈ నెల 25వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది. 6 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, హిందీతో పాటు తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. అది 'శబరీ ఫోర్ట్' పేరుతో పిలవబడే ఒక స్వామీజీ ఆశ్రమం .. ఆ స్వామీజీని అందరూ 'బాప్జీ' ( రఘువీర్ యాదవ్) పేరుతో పిలుస్తుంటారు. ఆశ్రమం పరిధిలో ఒక స్కూల్ ను కూడా నిర్వహిస్తూ ఉంటారు. అందులో చాలామంది ఆడపిల్లలు చదువుకుంటూ ఉంటారు. అక్కడ చదువుకుంటున్న టీనేజ్ అమ్మాయే 'మీనూ రావత్' (అనీత్ పడ్డా). ఆమె తల్లిదండ్రులు వైశాలి – ధర్మపాల్ రావత్. వాళ్లది మిడిల్ క్లాస్ ఫ్యామిలీ. ఒక రోజున ఆమె 'భోపాల్' లోని ఒక పోలీస్ స్టేషన్ కి తన పేరెంట్స్ తో వస్తుంది. తనపై బాప్జీ అత్యాచారానికి పాల్పడినట్టుగా ఫిర్యాదు చేస్తుంది. బాప్జీకి రాజకీయపరమైన పలుకుబడి ఉంటుంది. సమాజంలో ఆయనను బలంగా నమ్మే భక్తులు పెద్ద సంఖ్యలో ఉంటారు. ఈ కేసును డీల్ చేయడానికి ఏసీపీ జస్లీన్ (ఫాతిమా సనా షేక్) రంగంలోకి దిగుతుంది. ఆమె కూడా ఫ్యామిలీ వైపు నుంచి ఒక సమస్యతో సతమతమైపోతుంటుంది. అందులో భాగంగానే తరచూ సెంట్రల్ జైలుకి వెళ్లి వస్తుంటుంది. మీనూ రావత్ కి జరిగిన అన్యాయం గురించి ప్రజలు రకరకాలుగా మాట్లాడుకుంటూ ఉంటారు. మీడియా వాళ్లు పోలీసుల వైఫల్యాన్ని గురించి ప్రస్తావిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే బాప్జీని జస్లీన్ అరెస్టు చేస్తుంది. అతణ్ణి కోర్టులో ప్రవేశపెడుతుంది. దాంతో ఒక వైపు నుంచి జస్లీన్ కి .. మరో వైపున మీనూ రావత్ ఫ్యామిలీకి బెదిరింపులు వస్తుంటాయి. బాప్జీ అరెస్టు గురించి తెలిసి ఆయన కొడుకు 'కశ్యప్' ఆ ఊరుకి వచ్చేస్తాడు. ఆశ్రమం వ్యవహారాలు చూసుకుంటున్న 'శివాని'తో కలిసి మంతనాలు జరుపుతాడు. మీనూ రావత్ ఫ్యామిలీని ఇరికించే ప్లాన్ చేస్తాడు. అతని ప్రయత్నం ఫలిస్తుందా? జస్లీన్ చుట్టూ ఉన్న సమస్య ఏమిటి? బాప్జీకి శిక్ష పడేలా ఆమె చేయగలుగుతుందా? అనేది మిగతా కథ. దొంగ స్వామీజీలు భారీ స్థాయిలో ఆశ్రమాలను ఏర్పాటు చేసుకోవడం .. ఆ స్వామీజీల అనుచరులుగా కొంతమంది అక్కడ చేరడం .. లోపల అనేక అక్రమ కార్యకలాపాలు జరుగుతూ ఉండటం .. అవి బయటపెట్టడానికి ప్రయత్నిస్తే, ఆ ఫ్యామిలీని నానా ఇబ్బందులు పెట్టడం, అవినీతి అధికారులు వాళ్ల కొమ్ముకాయడం వంటి కథలు గతంలో చాలానే వచ్చాయి. కాకపోతే ఇక్కడ బాధితురాలితో పాటు ఇన్వెస్టిగేషన్ చేసే ఆఫీసర్ కూడా లేడీ కావడం కొంచెం కొత్తగా అనిపిస్తుంది. నగరంలోని ప్రజలలో చాలామంది దైవంగా భావించే స్వామీజీపై మీనూ రావత్ ఫిర్యాదు చేయడంతో, ఫస్టు ఎపిసోడ్ లోనే కథ ఆసక్తిని రేపుతోంది. ఏసీపీగా తన తొలి కేసు అయినప్పటికీ ఆమె ఏ మాత్రం భయపడకుండా స్వామీజీని అరెస్టు చేయడంతో ఈ కథలో మరింత కదలిక మొదలవుతుంది. ఇక తండ్రి అరెస్టు అయ్యాడని స్వామిజీ కొడుకు రంగంలోకి దిగడంతో కథ మరింత పుంజుకుంటుంది. ఈ నేపథ్యంలోనే మీనూ రావత్ కేసును తాను వాదిస్తానంటూ సిన్సియర్ న్యాయవాది 'భాలేరావ్' బరిలోకి దిగడం ఆడియన్స్ జారిపోనీయకుండా చేస్తుంది. ఇక ఇక్కడి నుంచి కోర్టు రూమ్ డ్రామా శాతం పెరుగుతూ వెళుతుంది. వాదనలు – ప్రతివాదనల జోరు పెరుగుతుంది. స్వామిజీ చేసిన తప్పు ఎలా బయటపడుతుంది? అనే టెన్షన్ ఒక వైపున సాగుతూ ఉండగానే, మరో వైపున 'నరబలి' .. ఆత్మహత్యలు వంటి సన్నివేశాలు స్క్రీన్ పైకి వస్తాయి. అయితే ఈ తతంగమంతా చాలా నిదానంగా ... నింపాదిగా జరుగుతూ ఉంటుంది. పోలీస్ కథల్లో కనిపించే స్పీడ్ .. హడావిడి ఈ కథలో మనకి కనిపించవు. స్వామిజీ పాత్రను ఆడియన్స్ ఆశించే స్థాయిలో డిజైన్ చేయకపోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. అలాగే ఆయన కొడుకు పాత్ర కూడా ఏ విధంగాను ప్రభావితం చేయలేకపోయింది. ఇక ఆశ్రమ నిర్వహణ మొత్తం చూసుకునే 'శివాని' పాత్ర లుక్ చూసి, నెగెటివ్ షేడ్స్ ఒక రేంజ్ లో ఉంటాయనుకున్న ప్రేక్షకులకు నిరాశనే ఎదురవుతుంది. ఈ మూడు పాత్రలను సరిగ్గా డిజైన్ చేయకపోవడం వలన గ్రాఫ్ తగ్గినట్టుగా అనిపిస్తుంది. పోలీస్ ఆఫీసర్ గా ఫాతిమా సనా షేక్ లుక్ బాగుంది. కానీ ఆమె పాత్రను చాలా సాదాసీదాగా డిజైన్ చేశారు. అలాగే జర్నలిస్ట్ అమితాబ్ సిన్హా పాత్ర .. న్యాయవాది భాలేరావు పాత్ర కూడా అంత పవర్ఫుల్ గా కనిపించవు. ఇక ఆధారాలు బయటపెట్టడం .. కోర్టులో జరిగే వాదోపవాదాలు కూడా అంత కిక్ ఇవ్వవు. స్క్రీన్ పైకి వచ్చే సన్నివేశాలన్నీ కూడా నిదానంగా సాగుతూ, చాలా రొటీన్ గా అనిపిస్తూ ఉంటాయి.

ప్రధానమైన పాత్రలను పోషించిన నటీనటులంతా చాలా సహజంగా నటించారు. కబీర్ తేజ్ పాల్ ఫొటోగ్రఫీ .. దీపికా కల్రా ఎడిటింగ్ తో పాటు, నేపథ్య సంగీతం ఫరవాలేదనిపిస్తుంది. నిర్మాణం పరంగా .. భారీతనం పరంగా ఈ సిరీస్ ఆకట్టుకుంటుంది. నటీనటుల ఎంపిక కూడా బాగుంది. అయితే రొటీన్ కథనే మళ్లీ చెప్పినట్టు అనిపిస్తుంది. దేవుడి ప్రతినిధులమంటూ కొత్త అవతారాలనెత్తే దొంగ స్వామీజీలను నమ్మకూడదు. ప్రజల బలహీనతయే వాళ్ల బలం. ఒక మనిషీ ఎప్పటికీ దేవుడు కాలేడు. దేవుడు మనకి ఇస్తూనే ఉంటాడుగానీ, మన నుంచి ఏమీ ఆశించడు. ఈ విషయాన్ని మరిచిపోకూడదనే ఒక సందేశాన్ని మరోసారి గుర్తుచేసిన సిరీస్ గా 'హుంకార్' గురించి చెప్పుకోవచ్చు.

# విడుదలకు ముందే షాక్..

## ఆన్‌లైన్‌లో 'తెల్లకాగితం' సినిమా కంటెంట్ లీక్!



అక్టోబర్ 2న అట్టహాసంగా థియేటర్లలో విడుదల కావాల్సిన టాలీవుడ్ సినిమా 'తెల్లకాగితం' చిత్ర యూనిట్‌కు భారీ షాక్ తగిలింది. సినిమా విడుదలకు కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉండగా.. ఈ చిత్రానికి సంబంధించిన కీలకమైన కంటెంట్ ఆన్‌లైన్‌లో లీక్ కావడం సినీ వర్గాల్లో కలకలం రేపింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర నిర్మాతతో పాటు టెక్నీషియన్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే ఈ వ్యవహారంపై స్పందించిన 'తెల్లకాగితం' చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. సినిమాకు సంబంధించిన లీకైన కంటెంట్‌ను ఎవరూ డౌన్‌లోడ్ చేయవద్దని, సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని మరియు ఇతరులకు సర్క్యులేట్ చేయవద్దని ప్రేక్షకులను హృదయపూర్వకంగా కోరింది. మా చిత్రం 'తెల్లకాగితం'కు సంబంధించిన కంటెంట్ అనుమతి లేకుండా ప్రచారం చేయబడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ సినిమా కంటెంట్‌ను చట్టపరంగా లీక్ చేయడాన్ని, షేర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. లీకైన కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని, డౌన్‌లోడ్ చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ సినిమాను కేవలం థియేటర్‌లలోనే వీక్షించి మా చిత్రబృందానికి మీరంతా సంపూర్ణ మద్దతు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. అంటూ తెల్లకాగితం చిత్ర బృందం ప్రెస్ నోట్ విడుదల చేసింది. సినిమా సక్సెస్ వెనుక ఎంతోమంది కష్టపడతారని, ఇలాంటి పైరసీ చర్యలు మరియు లీక్‌లు చిత్ర యూనిట్‌ను తీవ్రంగా దెబ్బతీస్తాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రేక్షకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, లీక్ అయిన వీడియోలను ఎంకరేజ్ చేయకుండా కేవలం థియేటర్లలోనే సినిమాను చూసి విజయవంతం చేయాలని సినీ పరిశ్రమ కోరుతోంది.

# శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి 'ఎత్తర ఎత్తు' సాంగ్ విడుదల!




టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్' జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మూడో సింగిల్ అయిన ఎత్తర ఎత్తు లిరికల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యమందించగా, నల్గొండ గద్దర్ నర్సన్న ఆలపించారు. బాలు.ఎస్ కీస్ ప్రోగ్రామింగ్, లక్ష్మీనారాయణ టీమ్ లైవ్ రిథమ్స్, రాబిన్ సెబాస్టియన్ గిటార్ అండ్ బాస్ అందించగా, బాలు.ఎస్ మిక్స్ అండ్ మాస్టరింగ్ చేశారు. ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాధికా శరత్‌కుమార్, షైన్ టోమ్ చాకో, ఉపేంద్ర లీమాయ్ తదితరులు కీలక పాత్రల్లో పోషిస్తున్నారు. కోన వెంకట్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పి మరియు కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై వెంకట కృష్ణ కర్ణాటి, సీత కర్ణాటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# బిడ్డను వదిలి షూటింగ్‌కు వెళ్లినప్పుడు మూడు గంటలు ఏడ్చాను : పరిణీతి చోప్రా!



తల్లిగా మారిన తర్వాత తన అనుభవాల గురించి బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడు నీర్‌ను వదిలి తొలిసారి పని కోసం ప్రయాణించినప్పుడు తాను మామ్ గిల్ట్‌కు (తీవ్రమైన అపరాధ భావన) గురయ్యానని తెలిపారు. ప్రసవం తర్వాత చాలా నెలలు బాబుతోనే ఉన్న తాను, తొలిసారి దూరంగా ప్రయాణిస్తున్నప్పుడు విమానంలో దాదాపు మూడు గంటల పాటు ఏడుస్తూనే ఉన్నానని, ఆ ప్రయాణం తనకు సరిగ్గా గుర్తులేదని ఆమె భావోద్వేగంగా చెప్పారు. ఇంట్లో కుటుంబ సభ్యులు బాబును బాగా చూసుకుంటున్నా, మీ బాబు ఎక్కడ? అంటూ సమాజం నుంచి ఎదురయ్యే ప్రశ్నలు తల్లులపై మరింత మానసిక ఒత్తిడిని పెంచుతాయని ఆమె పేర్కొన్నారు. కాగా, రాఘవ్ చద్దా, పరిణీతి దంపతులకు అక్టోబర్ 19, 2025న బాబు (నీర్) జన్మించాడు. ప్రస్తుతం పరిణీతి తన రీఎంట్రీ ప్రాజెక్ట్ నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'షక్: ట్రస్ట్ నో వన్' షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు.

# ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రశ్నార్థకంగా మారిన మానవాళి మనుగడ









**మేడ్చల్(ప్రశ్న న్యూస్)** ప్లాస్టిక్ వాడకం వల్ల మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని కమాధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేష్ అన్నారు. మేడ్చల్ జిల్లా, శాపూర్‌నగర్ లోని యంపి జెపిబిసి. బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం నాడు కామధేను ఫౌండేషన్, పోల్యుషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్లాస్టిక్ , ఘన వ్యర్థాల నిర్వహణ పై అవగాహన కార్యక్రమంతో పాటు విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గోన్న పి. వెంకటేష్ మాట్లాడుతు నేటి ఆధునిక జీవితంలో ప్లాస్టిక్ ఒక భాగమైపోయిందని, దాని వల్ల కలిగే అనర్థాలు అత్యంత ప్రమాదకరమైనవని వివరించారు ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం భూగర్భ జలాలు అంతరించడం ఆరోగ్య సమస్యలు వాయు కాలుష్యం మూగజీవాల మరణాలు డ్రైనేజీ వ్యవస్థ స్తంభించడం వంటి అనేక సమస్యలతో పాటు పర్యావరణానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తుందని వివరించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పరిణమించే అనర్థాలను దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, బట్ట సంచులు , జ్యూట్ బ్యాగులు, స్టీల్ – గాజు పాత్రలను వాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గోన్న పొల్యూషన్ కంట్రోలర్ బోర్డు ఏ.ఈ వీరేషం మాట్లాడుతు ఘన వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఘన వ్యర్థాలు అనేక రకాలుగా ఉంటాయని, ఇవి పర్యావరణానికి అత్యంత ప్రభావవంతమైన ముప్పుగా మారే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఘన వ్యర్థాల్లో ఆహార వ్యర్థాలు, కాగితం, ప్లాస్టిక్‌లు, పెరటి వ్యర్థాలు వంటి గృహ వ్యర్థాలుతో పాటు పారిశ్రామిక వ్యర్థాలలో విషపూరిత రసాయనాలు ఉంటాయని, వ్యవసాయానికి సంబంధించిన వ్యర్థాల్లో పంట అవశేషాలు, ఎరువు వంటివి, వైద్యపరమైన వ్యర్థాలలో గడువు ముగిసిన మందులు, సిరంజిలు, ఇతర వైద్య వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో పనిచేయని కంప్యూటర్లు, టెలిఫోన్లు టెలివిజన్లు వంటి పాత ఎలక్ట్రానిక్ పరికరాలు, నిర్మాణ వ్యర్థాలలో కలప, ఇటుకలు కాంక్రీటు వంటి కూల్చివేత లేదా నిర్మాణ వ్యర్థాలు పర్యావరణంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, తద్వారా వాటి నుండి వెలువడే ప్రతికూల ప్రభావాలను కనిష్ట స్థాయికి తగ్గించి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని సూచించారు. ఘన వ్యర్థాలను విచ్చలవిడిగా పడేయడం వల్ల కాలుష్యం పేరుకుపోయి పర్యావరణానికి తీవ్రమైన హాని కలుగుతుందని హెచ్చరించారు. ఫలితంగా వాయు కాలుష్యం బహిరంగంగా వ్యర్థాలను కాల్చడం వల్ల ఫ్యూరాన్లు , డయాక్సిన్లు వంటి ప్రమాదకరమైన వాయువులు వెలువడతాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తడి, పొడి, హానికరమైన వ్యర్థాలను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపాల్ స్రవంతి మాట్లాడుతు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన పీసీబీ అధికారులు, కామధేను ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలోని అంశాలను భాద్యతగా ఆచరించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కెమ్లిన్, యాధవ్, పవన్, ఠాకూర్ తదితరులు పాల్గోన్నారు.

# మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్‌లో ఘనంగా హార్ట్ డే






**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )**వరల్డ్ హార్ట్ డే ను పురస్కరించుకొని వారం రోజుల పాటూ తెలంగాణాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ నేతృత్వంలో ఏటా సెప్టెంబర్ 29 నాడు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే వరల్డ్ హార్ట్ డే ను పురస్కరించుకొని తెలంగాణా లోని పలు పట్టణాలలో వారం రోజుల పాటూ ప్రత్యేక వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 24 న యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో తో మొదలైన ఈ కార్యక్రమం అటు పిమ్మట భువనగిరి, అలియాబాద్, యం సి పల్లి, గజ్వేల్, తూప్రాన్, చేర్యాల, చేగుంట లలో జరిగింది. అనంతరం మేడ్చల్ జిల్లా ఘనాపూర్ లో ని మెడిసిటి గ్రూప్ ఆప్ హాస్పిటల్ లో నిర్వహించారు. ఘన్ పూర్ లోని మేడ్చల్ చౌరస్తా నుండి హనుమాన్ గుడి నుండి ఘన్ పూర్ రహదారిపై కూడా వాకథాన్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఘన్ పూర్ కౌన్సిలర్ నూనావత్ పార్వతి దంపతులు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి వాకథాన్ ను ప్రారంభించారు. వాక్ అనంతరం గ్రామస్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగ పడిందని , ఎన్నో విషయాలు దీనిద్వారా నేర్చుకొన్నామని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.నేడు చివరగా ఈ వాకథాన్ ముగింపు కార్యక్రమం మేడ్చల్ పట్టణంలో ఈ ప్రత్యేక వాకథాన్ ను మెడిసిటి గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్ కు చెందిన మెడినోవా సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈఓ ఐనిష్ మర్చంట్ హాజరై వాక్ థాన్ ను జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలో ఉన్న మెడినోవా హాస్పిటల్ నుండి ప్రారంభమైన ఈ వాక్ థాన్ మేడ్చల్ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా వివేకానంద విగ్రహం వరకు సాగి చివరికి హాస్పిటల్ వద్ద ముగిసింది. మెడినోవా, మెడిసిటి హాస్పిటల్స్ కు చెందిన సిబ్బందితో పాటూ మేడ్చల్ లోని స్ఫూర్తి కాలేజి, ఎలివేట్ అకాడమి విద్యార్థులు కూడా ఇందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఐనిష్ మర్చంట్ మాట్లాడుతూ శరీరంలోని గుండె అనేది ఎంతో కీలకమని దానిని కాపాడుకోవడం అత్యంత ఆవశ్యకతతో కూడిన అంశమని అన్నారు. గుండె పని తీరు మంచిగా ఉండాలంటే నిత్యం వ్యాయమం చేయడం, మంచి ఆహారం తీసుకోవడం తో పాటూ ఒత్తిడి తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతే గాకుండా గుండె కు సంబంధించిన శరీరం ఇచ్చే కీలక సంకేతాలను గమనంలో ఉంచుకొని ఏదైనా అనుమానం తలెత్తితే వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు.

అనంతరం హాస్పిటల్ వైద్యులు మాట్లాడుతూ గుండె సక్రమం గా పని చేయాలంటే ఆహారం లో ఉప్పు వాడకం తగ్గించాలన్నా.. మద్యానికి బానిసలు కాకుండా ఉంటే గుండె ఆరోగ్యం సక్రమం గా ఉంటుందన్నారు . తగినంత సమయం నిద్ర పోవాలని, మానసిక వత్తిళ్లకు దూరం గా ఉంటే మనగుండె పదికాలాలపాటు నిరంతరాయంగా పని చేస్తున్నందన్నారు.ఈ కార్యక్రమంలో ఐనిష్ మర్చంట్ తో పాటూ డా. కుషాల్ సారంగత్, డా. రవి కుమార్, డా. మాధవ రెడి, డా.ఫైజుద్దిన్, డా. మనోజ్ కుమార్, డా వంశీ కృష్ణ, డా. నవీన్ కుమార్ లతో పాటూ హాస్పిటల్ సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలి




**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి, లక్ష్యాన్ని త్వరలోనే 70 శాతం దాటించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు సన్నాహాలు, రైతుల సంక్షేమంపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడానికి సన్నాహాలను సమీక్షించడానికి జిల్లా అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులు కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులతో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలానికి కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, స్థల సేకరణ, రవాణా ఆలస్యం కాకుండా నివారించేందుకు జిల్లాల్లో ప్రత్యామ్నాయ గోదాములు అదనపు నిల్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డిఎం సుగుణ బాయి, సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ

# రుణమాఫీ చేయాలి

**- పూడూరు సొసైటీ చైర్మన్ ఎన్ సుధాకర్ రెడ్డి**




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )**ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని పూడూరు సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ అన్నారు. మంగళవారం మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న రైతు వ్యవసాయ సహకార సంఘం 49వ సర్వసభ్య సమావేశం సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్లు,సొసైటీ ఎండీ సాయి దత్త చైతన్య,ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ రవి శంకర్,సొసైటీ పరిధిలోని పలువురు రైతులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఎన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సొసైటీ నుండి రుణాలు తీసుకున్న రైతులందరూ సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.తమ సొసైటీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత తీర్మానం చేసి వన్ టైం సెటిల్మెంట్ కు అవకాశం ఇవ్వగా రూ.2 కోట్ల వరకు రుణాలు వసూలు అయినట్లుగా తెలిపారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ వల్ల ఎరువుల కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రభుత్వం దీన్ని తీసేయాలని కోరారు.అలాగే రాష్ట్రంలోని రైతు సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.నా నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో రైతు వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ శ్యామ్ లాల్,డైరెక్టర్లు స్వరూప,మలోత్ రవి,విఠల్ రెడ్డి,వీరేందర్ గౌడ్,చిన్న మల్లేష్,మామిండ్ల శ్రీశైలం,డి విజయ్ కుమార్,అర్జున్, బి.శ్రీనివాస్ గౌడ్,తునికి సత్తెమ్మ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను రాజీనామా కోరడం హాస్యాస్పదం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సర్ కు వ్యతిరేకంగా ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ ను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేయడం దయ్యాలు వేదాలు వల్ల ఇచ్చినట్లు ఉందని బిజెపి సీనియర్ నేత పాతూరి సుధాకర్ రెడ్డి ఆరోపించారు. దేశంలో 60 సంవత్సరాల ఏకఛత్రధిపత్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కాంగ్రెస్ గాంధీ కుటుంబం పాలనలో విచ్చవీడి అవినీతి అక్రమాలు బంధుప్రీతి దేశ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. సిబిఐ ఎన్నికల కమిషనర్ సుప్రీంకోర్టుతో సహా అన్ని ప్రభుత్వ నిర్వాహక సంస్థలను తమ జేబు సంస్థగా మార్చుకొని పాలించిన కాంగ్రెస్ గాంధీ కుటుంబ ప్రభుత్వాలు. పార్లమెంట్ సభ్యుని హైకోర్టు జడ్జి గా నియమించిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ. దేశాన్ని చీకటి రాజ్యం ఎమర్జెన్సీ తో సహా అలాంటివీ ఎన్నో రాజ్యాంగన్ని బొందపెట్టి కార్యక్రమాలు చేపట్టిందని విమర్శించారు. ఎన్నికల కమిషనర్ రాజ్యాంగబద్ధంగా చట్ట ప్రకారం గతంలో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం ప్రతి 20 సంవత్సరాలకు నిర్వహించిన ఎస్ ఐ ఆర్ ను అమలు చేస్తున్న ఎన్డీఏ బిజెపి మోడీ కేంద్ర ప్రభుత్వం. అన్ని వ్యవస్థలు కంప్యూటీకరణ అయిన తర్వాత కంప్యూటర్ లో అన్ని వ్యవస్థల అధికారులు చట్ట ప్రకారం ఫీడ్ చేసిన నిబంధన ప్రకారమే ప్రభుత్వ సిబ్బంది అధికారులు నడుచుకోవాలి అని సూచించారు

## గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ

# చట్టవిరుద్ధమైన చర్య

**- జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )**మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లాలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపికను నిరోధించేందుకు అమలులో ఉన్న పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. చట్టం, 1994 నిబంధనల అమలు, పర్యవేక్షణపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (పట్టణ స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ కార్యదర్శిగా వ్యవహరించారు.ఈ సమావేశంలో పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. కార్యక్రమం నోడల్ అధికారి డా. గీతా ప్రసాద్, సైబరాబాద్ మహిళలు బాలల భద్రత విభాగం ఏసీపీ శ్ కృష్ణ ప్రసాద్, మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ నరసింహారెడ్డి, కార్వె డియమ్ ఫౌండేషన్ ప్రతినిధి బి. కుమార్ కృపా, డిప్యూటీ జిల్లా ఎక్స్‌టెన్షన్ మీడియా అధికారి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. చట్టం, నిబంధనలకు అనుగుణంగా మొత్తం 30 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. వీటిలో 18 కొత్త దరఖాస్తులు, 12 పునరుద్ధరణ దరఖాస్తులు ఉన్నాయి. సంబంధిత రికార్డులు, నిబంధనలను పరిశీలించిన అనంతరం కమిటీ చర్చించి మొత్తం 30 దరఖాస్తులకు ఆమోదం తెలిపింది.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మాట్లాడుతూ, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ లింగ ఎంపికకు దారితీసే చర్యలను అరికట్టేందుకు పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు. అల్ట్రాసౌండ్, ఇమేజింగ్ కేంద్రాల్లో నిర్వహించే వైద్య పరీక్షలు చట్టబద్ధమైన వైద్య అవసరాలకు మాత్రమే పరిమితం కావాలని, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా సంబంధిత కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక మాట్లాడుతూ, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమైన చర్య అనే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు, మున్సిపల్ మరియు స్థానిక సంస్థలు, మహిళా--శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ సంస్థల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఆడపిల్లల భ్రూణహత్యకు స్వస్తి పలికి, ఆడపిల్లలను రక్షించడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం ద్వారా లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమావేశంలో పేర్కొన్నారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక చట్టవిరుద్ధమని, పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. చట్ట నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయండి



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) నాలుగు దశాబ్దాలుగా జర్నలిస్టులుగా సేవలందిస్తున్న తమకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో వివిధ పత్రికలు, న్యూస్ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ తమ వృత్తిని కొనసాగిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు సొంత నివాస స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు మంత్రికి వివరించారు.నాలుగు దశాబ్దాలుగా జర్నలిజాన్ని నమ్ముకుని ప్రజలకు సేవ చేస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి స్థలం లేకపోవడం బాధాకరమని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. జర్నలిస్టుల వినతిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జర్నలిస్టులు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన వివిధ పత్రికలజర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్పత్రుల్లో దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు

- చికిత్సకు ముందు అంచనా ఖర్చు ఎందుకు ఇవ్వకూడదు.?
- ప్రతి పరీక్ష అవసరాన్ని రోగి కుటుంబానికి ఎందుకు వివరించకూడదు.?
- ప్యాకేజీలో ఉన్నవి, అదనపు ఛార్జీలు ఏవో ముందే ఎందుకు చెప్పకూడదు.?
- భారీ బిల్లులపై ఫిర్యాదులను అధికారులు ఎంత వేగంగా పరిష్కరిస్తున్నారు.?
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆసుపత్రులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?
- వైద్యం సేవా రంగమా.? వ్యాపార రంగమా.?

**ప్రైవేట్ ఆసుపత్రులు వైద్య రంగంలో కీలకమైన సేవలు అందిస్తున్నాయి. అదే సమయంలో రోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించేలా పారదర్శకత పాటించడం కూడా అంతే ముఖ్యం. వైద్యం అందించే సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. బిల్లు చూసి భయపడే పరిస్థితి ఉండకూడదు. విజయశాంతి లేవనెత్తిన ప్రశ్న. ఎప్పటినుండో సామాన్యుడి సమస్య కూడా ఇదే**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ )**ఆసుపత్రికి వెళ్తే ఎన్ని పరీక్షలు అవసరం.? వాటి ఖర్చు ఎంత.? అనే ప్రశ్న ఇప్పుడు సామాన్య ప్రజలను వెంటాడుతోంది.రోగి ఆసుపత్రిలోకి వెళ్లేది ప్రాణం కాపాడుకోవడానికి. అనారోగ్యంతో ఉన్న వ్యక్తి, అతని కుటుంబ సభ్యులు ఆ సమయంలో ఖర్చుల కంటే చికిత్సకే ప్రాధాన్యత ఇస్తారు. అలాంటి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని చికిత్సకు సంబంధించిన ఖర్చులు, అవసరమైన పరీక్షలు, అంచనా వ్యయం వంటి వివరాలను కార్పొరేట్, ప్రైవేటు హాస్పిటల్స్ ముందుగానే స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందనే డిమాండ్ పెరుగుతోంది.

### విజయశాంతి అసెంబ్లీల్లో లేవనేత్తిన ప్రశ్నలకు సమాధానం ఎక్కడ.?

జబ్బు వస్తే డాక్టర్ దగ్గరకు వెళ్లాలి కానీ చికిత్స పూర్తయ్యాక చేతిలో డబ్బులు లేకుండా పోతే పరిస్థితి ఏంటి.? ప్రస్తుతం సామాన్య ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్న ఇదే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పేరుతో వివిధ పరీక్షలు, స్కాన్లు, మందులు, ఇతర ఛార్జీలతో బిల్లులు పెరుగుతున్నాయనే ఆందోళనలు తరచూ వినిపిస్తున్నాయి.ఇదే అంశంపై తెలంగాణ శాసనమండలిలో ఎమ్మెల్సీ విజయశాంతి ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులపై పడుతున్న ఆర్థిక భారాన్ని ప్రస్తావించారు. సాధారణ జ్వరం వంటి సమస్యలతో ఆసుపత్రులకు వెళ్లిన వారికి రక్త, మూత్ర పరీక్షలు, స్కాన్లు, ఎక్స్‌రేలు తదితర పరీక్షల పేరుతో భారీగా ఖర్చు అవుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. కొన్ని సందర్భాల్లో రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు బిల్లులు వస్తున్నాయని ఆమె సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇలా కార్పొరేట్ ప్రైవేటు ఆసుపత్రుల బహిరంగ దోపిడీపై ప్రజలలో ఎంత చర్చ జరిగిన ప్రభుత్వము మాత్రం కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమైపోయింది.

### హాస్పిటల్ అంటేనే భయం

జబ్బు వస్తే డాక్టర్ దగ్గరకు వెళ్లాలి. కానీ ఆసుపత్రి నుంచి బయటకు వచ్చేసరికి చేతిలో డబ్బులు లేకుండా పోతే పరిస్థితి ఏంటి.? ప్రస్తుతం సామాన్య ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్న ఇదే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న సమయంలో బిల్లులు హద్దు అదుపు లేకుండా పెంచుతున్నారనే ఆందోళనలు తరచూ వినిపిస్తున్నాయి. అవసరమైన వైద్యం అందించడంతో పాటు ఖర్చుల విషయంలో పూర్తి పారదర్శకత ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

### రోగి ఆసుపత్రిలోకి వెళ్లేది ప్రాణం కాపాడుకోవడానికి..

ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రికి వెళ్లే వ్యక్తి అప్పటికే మానసికంగా, శారీరకంగా ఇబ్బందుల్లో ఉంటాడు. అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ఖర్చుల గురించి ఎక్కువగా ఆలోచించే పరిస్థితిలో ఉండరు. అలాంటి సమయంలో ఏ పరీక్ష ఎందుకు చేయాలి.? ఎంత ఖర్చవుతుంది.? చికిత్సకు మొత్తం అంచనా ఎంత.? అనే వివరాలు ముందుగానే స్పష్టంగా తెలియకపోతే చివరికి భారీ బిల్లు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. దానితో పేద మధ్య తరగతి కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం లేక నిర్లక్ష్యంతో కూడిన వైద్యం ఉండడంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయి.

### ఒక్కో పరీక్ష.. ఒక్కో ఛార్జీ..

రక్త పరీక్షలు, స్కానింగ్‌లు, ఇతర నిర్ధారణ పరీక్షలు, మందులు, గది ఛార్జీలు, డాక్టర్ ఫీజులు, ప్రొసీజర్ ఛార్జీలు ఇలా ఒక్కో అంశానికి ఒక్కో బిల్లు చేరుతూ మొత్తం ఖర్చు అంచనాలకు అందనంత పెరుగుతోందని కొందరు రోగుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.ఈ పరీక్ష ఎందుకు.? అని అడిగితే సరైన వివరణ దొరుకుతుందా.?ఇంత బిల్లు ఎందుకు వచ్చింది.? అని అడిగితే పూర్తి వివరాలు అందుతున్నాయా.?
ఇలాంటి ప్రశ్నలకు ఆసుపత్రుల యాజమాన్యాలు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### ప్యాకేజీ పేరుతో స్పష్టత ఎంత.?

కొన్ని చికిత్సలకు ప్యాకేజీలు ప్రకటించినప్పటికీ అందులో ఏ సేవలు ఉన్నాయి.? ఏవి అదనపు ఛార్జీలు.? అనే విషయం రోగి కుటుంబానికి ముందుగానే తెలియాలి.చికిత్స పూర్తయ్యాక బిల్లును చూసి ఆశ్చర్యపోయే పరిస్థితి రాకుండా చికిత్సకు ముందే అంచనా వ్యయం, అదనపు ఖర్చుల అవకాశం, అందించే సేవల వివరాలను లిఖితపూర్వకంగా ఇవ్వడం అవసరం.

### ఆరోగ్య బీమా ఉన్నా.. సమస్యలు ఎందుకు.?

హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్న కుటుంబాలు కూడా ఆసుపత్రి బిల్లుల విషయంలో కొన్నిసార్లు అయోమయానికి గురవుతున్నాయి. ఏ ఖర్చు బీమాలో వస్తుంది.? ఏది రాదు.? రోగి ఎంత చెల్లించాలి.? వంటి విషయాల్లో ముందస్తు సమాచారం లేకపోతే చివరికి కుటుంబ సభ్యులపైనే ఆర్థిక భారం పడుతుంది.

### అత్యవసర పరిస్థితిని ఆసరాగా చేసుకోవద్దు

అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో రోగి కుటుంబం ప్రశ్నించే పరిస్థితిలో ఉండదు. అలాంటి సందర్భాల్లో కూడా చికిత్సకు సంబంధించిన ముఖ్యమైన ఖర్చుల వివరాలను సాధ్యమైనంత త్వరగా కుటుంబ సభ్యులకు తెలియజేయడం ఆసుపత్రుల బాధ్యతగా ఉండాలి.
రోగి నిస్సహాయతను ఎవరూ ఆర్థిక ఒత్తిడిగా మార్చకూడదు.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?

కార్పొరేట్,ప్రైవేట్ ఆసుపత్రులపై సంబంధిత శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. రోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించడంతో పాటు నిబంధనల అమలు, బిల్లుల పారదర్శకత, రోగులకు అందుతున్న సేవలపై అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### ఫిర్యాదు చేస్తే చర్యలు ఉంటాయా.?

చాలావరకు ఆసుపత్రుల్లో వైద్య సేవలకు అయ్యే ఖర్చులకు సంబంధించిన ధరల పట్టీలు ఉండాలి. అధిక బిల్లు వసూలు చేశారని, సేవలపై సరైన సమాచారం ఇవ్వలేదని లేదా ఇతర నిబంధనల ఉల్లంఘన జరిగిందని రోగి కుటుంబం భావిస్తే ఫిర్యాదు చేసే అవకాశం సులభంగా ఉండాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తిని ఆసుపత్రి చుట్టూ తిప్పకుండా సంబంధిత అధికారులు వేగంగా స్పందించే వ్యవస్థ ఉండాలి.రోగి ప్రాణం ముందు, బిల్లు తర్వాత అన్నట్లుగా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి.ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, చికిత్స ఖర్చులు, బిల్లింగ్ విధానం, ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆసియా క్రీడల్లో నీరూ ధండా చారిత్రక స్వర్ణం

**- అభినందించిన ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో భారత షూటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరూ ధండా చారిత్రక స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల చరిత్రలో ఈ విభాగంలో వ్యక్తిగత స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె రికార్డు సృష్టించింది. ఇదే ఈవెంట్‌లో మహిళల జట్టు రజత పతకాన్ని గెలుచుకుని భారత్ ఖాతాలో మరో పతకాన్ని చేర్చింది. ఈ చారిత్రక విజయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందిస్తూ ఎక్స్ లో పోస్టులు పెట్టారు. “నీరూ ధండా భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించింది. ఆసియా క్రీడల ట్రాప్ ఈవెంట్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళగా నిలిచిన ఆమెకు అభినందనలు. ఆమె అద్భుతమైన కచ్చితత్వం, నిలకడ దేశానికి గర్వకారణం. ఈ విజయం ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది” అని మోదీ పేర్కొన్నారు. అలాగే, టీమ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన మనీషా, నీరూ, ఆషిమాలను కూడా ప్రధాని అభినందిస్తూ, వారి టీమ్‌వర్క్‌ను ప్రశంసించారు.మంగళవారం జరిగిన ఫైనల్‌లో నీరూ ధండా అత్యంత నిలకడైన ప్రదర్శన కనబరిచింది. మొత్తం 28 హిట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. చైనాకు చెందిన సన్ యునోంగ్ (26 హిట్లు) రజతం గెలుచుకోగా, కువైట్‌కు చెందిన హాజర్ అబ్దుల్‌మాలిక్ (21 హిట్లు) కాంస్యంతో సరిపెట్టుకుంది. అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లోనూ 118 పాయింట్లతో నీరూ అగ్రస్థానంలో నిలవడం విశేషం. మరోవైపు, మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో నీరూ ధండా, ఆషిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కూడిన భారత బృందం రజత పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈ ముగ్గురూ సంయుక్తంగా 328 స్కోరు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఈ విభాగంలో చైనా (346) స్వర్ణం గెలుచుకోగా, కువైట్ (325) కాంస్య పతకం దక్కించుకుంది. అయితే, ఆషిమా, మనీషా వ్యక్తిగత ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు.

## సైబర్ మోసాల బారిన పడుతున్న ఉన్నత విద్యావంతులు

**- బాధితుల్లో ఐటీ నిపుణులు, డాక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు**




మద్రాస్ (ప్రశ్న న్యూస్) సైబర్ ఆర్థిక మోసాల బారిన కేవలం నిరక్షరాస్యులు, అవగాహన లేని వారు మాత్రమే పడతారనే అపోహను ఐఐటీ మద్రాస్ తాజా అధ్యయనం పటాపంచలు చేసింది. ఉన్నత విద్యావంతులు, డిజిటల్ పరిజ్ఞానం కలిగిన ఉద్యోగులు సైతం పెద్ద సంఖ్యలో ఈ మోసాలకు గురవుతున్నారని ఈ పరిశోధన స్పష్టం చేసింది. కేవలం డిజిటల్ అక్షరాస్యత కలిగి ఉండటం ఒక్కటే సైబర్ నేరాల నుంచి పూర్తి రక్షణ కల్పించలేదని ఈ నివేదిక తేల్చి చెప్పింది. ఐఐటీ మద్రాస్‌కు చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి, ప్రొఫెసర్ పి. కందస్వామి, ప్రొఫెసర్ నందన్ సుదర్శనం నేతృత్వంలో ఈ అధ్యయనం సాగింది. ఇందుకోసం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లోని బాధితులపై సర్వే నిర్వహించారు. బాధితుల్లో ఐటీ నిపుణులు, బ్యాంకు ఉద్యోగులు, వైద్యులు, ఆర్థిక రంగ నిపుణులు, ప్రభుత్వ అధికారులతో పాటు సైబర్ సెక్యూరిటీ ధ్రువీకరణ పత్రాలు కలిగిన వారు సైతం ఉండటం గమనార్హం.సైబర్ నేరగాళ్లు బాధితులను ఎంచుకోవడంలో ప్రత్యేక వ్యూహాలను అనుసరిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా కుటుంబంలో అనారోగ్య సమస్యలు, ఉద్యోగ వేట, పదవీ విరమణ, పని ఒత్తిడి వంటి కారణాలతో మానసిక ఆందోళనకు గురవుతున్న వారిని వీరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. భయం, ఆత్మన్యూనత వంటి భావోద్వేగాలను ఆసరాగా చేసుకుని, వారిని మానసికంగా లొంగదీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ మోసాల కారణంగా బాధితులు కేవలం ఆర్థికంగానే కాక, తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. అవమాన భారంతో కుంగిపోవడం, నిద్రలేమి, డిప్రెషన్, కుటుంబ సభ్యుల నమ్మకాన్ని కోల్పోవడం వంటి పరిణామాలు వారిని వేధిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు, సైబర్ క్రైమ్ విభాగాలు సత్వరమే స్పందిస్తున్నప్పటికీ, మరికొన్ని విభాగాలు సాంకేతిక సామర్థ్యం లోపం కారణంగా వెనుకబడుతున్నాయని ఈ అధ్యయనం గుర్తించింది. ఈ నేపథ్యంలో, నివారణ వ్యూహాలను రూపొందించేటప్పుడు ఈ క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# వక్ఫ్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తే నేలమట్టం

## మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి

- సర్వే నంబర్ 499లో 150 గజాల స్థలంలో పిల్లర్లు
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు
- సర్వేనెంబర్ 400లో అక్రమ నిర్మాణం సంగతేమిటో.?
- సర్వే నంబర్ 400 నిర్మించిన అక్రమ నిర్మాణం సంగతేమిటి కమిషనర్ సాబ్
- ఒకరికి ఒక న్యాయం, ఇంకొకరికి మరో న్యాయం వెనుక కమిషనర్ అంతర్యం ఏమిటో.?







**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని గజ్వేల్‌లో వక్ఫ్ భూమిలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణంపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. గజ్వేల్--జాలిగామ బైపాస్ రహదారి లోపల సర్వే నంబర్ 499లో సుమారు 150 గజాల స్థలంలో ఏర్పాటు చేసిన పిల్లర్లను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు.వక్ఫ్ భూమిలో రాత్రికి రాత్రే నిర్మాణ పనులు చేపట్టారంటూ వక్ఫ్ ముతవల్లీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. దర్గా హజరత్ సయ్యద్ షా మహ్మద్ ఖాద్రీ వక్ఫ్ ఆస్తికి ఈ భూమి చెందుతుందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. 2001 డిసెంబర్ 20న వెలువడిన గెజిట్ నంబర్ 46-ఏలో ఈ ఆస్తి వివరాలు ఉన్నట్లు తెలిపారు.ఈ వ్యవహారంపై గతంలో



సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి

తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు జిల్లా కలెక్టర్ ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. వక్ఫ్ ఆడిట్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ సాబీర్ సైతం గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### అక్రమ నిర్మాణాలను కూల్చేసాం :మున్సిపల్ కమిషనర్ పి. గణేష్ రెడ్డి

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి స్పష్టం చేశారు. వక్ఫ్ భూములను పరిరక్షించేందుకు నిబంధనల ప్రకారం చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## మరి దీని సంగతేమిటి కమిషనర్ సాబ్



గజ్వేల్ మున్సిపల్ పరిధిలో దాదాపు 600 వక్ఫ్ బోర్డ్ భూమిలో టౌన్ ప్లానింగ్ అధికారిని దీపిక కనుసైగల్లో నిర్మించిన అక్రమ నిర్మాణం పై ఇప్పటివరకు కమిషనర్ గణేష్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒకరికి ఒక న్యాయం అదే వక్ఫ్ బోర్డ్ స్థలంలో నిర్మిస్తున్న మరొకరికి ఒక న్యాయమా అంటూ నిలదీస్తున్నారు.

సర్వే నంబర్ 400 లో మాజీ కమిషనర్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారిని దీపిక కనుసైగల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణం పై పత్రికలలో కథనాలు వచ్చిన ఫిర్యాదులు వచ్చిన, సాక్షాత్ మూతవల్లి వచ్చి ఫిర్యాదు చేసిన ఎందుకు చర్యలు తీసుకోలేదని వాళ్లతో టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆర్థిక లావాదేవీల ఒప్పందాలు ఉండడం వల్లే చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు కూడా వచ్చాయని అది నిజమన్నట్లుగా ఇప్పటివరకు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేత చేయకపోవడం ఇందుకు నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు నైవేద్యం పెడితే ఒకలా లేకుంటే మరోలనా.? కూల్చివేతలు తప్పవు అన్న అనుమానాలు ఈ అక్రమ నిర్మాణం కూల్చక పోవడం వెనుక అర్థమవుతుందని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైన గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ కు వక్ఫ్ బోర్డుల భూముల పరిరక్షణపై చిత్తశుద్ధి ఉంటే ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588